సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో ఆట, పాట, మాట

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఆగస్టు 14 అర్ధరాత్రి వరకు స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో ఆట-పాట-మాట కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు ప్రజాసంఘాల నాయకులు తెలిపారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశ్వర్లు అధ్యక్షతన కార్మిక కర్షక భవన్‌లో సిఐటియు రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల సమావేశం నిర్వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమం సందర్భంగా అనేకమంది త్యాగధనులు తమ ప్రాణాలను పనంగాపెట్టి స్వాతంత్రాన్ని సాధించారని వారి స్ఫూర్తితో సాధించుకున్న స్వాతంత్ర్యానికి ముప్పు ఏర్పడిందని అన్నారు. నేడు భారతదేశంలో మతోన్మాదాల నుండి ఉన్న పెనుముప్పును ప్రజలకు వివరించడానికి ఆగస్టు 14న సాయంత్రం నుండి అర్ధరాత్రి వరకు ఆటపాట మాట అనే కార్యక్రమాన్ని ఇన్ని మండల కేంద్రాల్లోనూ ముఖ్యమైన గ్రామాలలోనూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని తమకు నచ్చిన పాటను లేదా తమకు వచ్చిన ఆటను ప్రదర్శించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి ప్రజాసంఘాల కార్యకర్తలు అందరూ కూడా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.నారాయణ పాల్గొన్నారు.

వైసిపిలో విభేదాలు..!

- పెరుగుతున్న ఆశావహులు
- ఐదు నియోజకవర్గాల్లో అదే పరిస్థితి

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

వైసిపిలో విభేదాలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. ఆశావహులు సంఖ్య కూడా పెరుగుతోంది. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో అదే పరిస్థితి కనిపిస్తోంది...

కర్నూలు జిల్లా వైసిపికి కంచుకోటలా 2019 ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేసింది. ప్రస్తుతం రాజకీయ పరిస్థితులు వైసిపిలో వేగంగా మారుతున్నాయి. ఎక్కడ చూసినా వైసిపిలో విభేదాలు బయట పడుతున్నాయి. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఆలూరు నియోజకవర్గంలో ఈ పరిస్థితి తీవ్రంగా ఉంది. వైసిపి ఏర్పడినప్పటి నుంచి ఆలూరు నియోజకవర్గంలో వైసిపి అంటే జయరామ్, జయరామ్ అంటే వైసిపి అనేవిధంగా ఉండేది. కానీ మంత్రి, ఆయన సోదరుల పని విధానాలు నచ్చక వచ్చే ఎన్నికల్లో వైసిపి నుంచి ఆలూరు నియోజకవర్గానికి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు పార్టీ కార్యక్రమాలు సొంతంగా చేస్తూ తమదైన శైలిలో ఆశావహులు ముందుకు వెళ్తున్నారు. ఉమ్మడి జిల్లా పంచాయతీ రాజ్ వింగ్ జోనల్ ఇన్‌ఛార్జీ, చిప్పగిరి జడ్‌పిటిసి బి.విరుపాక్షి, దేవనకొండ మండలానికి చెందిన ఆస్పరి మాజీ జడ్‌పిటిసి కప్పట్రాల బొజ్జమ్మ (సుశీలమ్మ), వైసిపి సీనియర్ నాయకులు తెర్నేకల్ కొత్తకాపు మధుసూదన్ రెడ్డి మంత్రి జయరామ్‌తో కలువకుండా కార్యక్రమాలు చేస్తున్నారు. వారి మధ్య తీవ్ర విభేదాలు నడుస్తున్నాయి. వారందరూ ఈ సారి ఎన్నికల్లో ఎమ్మెల్యే సీటును ఆశిస్తున్నారు. వారితో పాటు శ్రీశైలం అసెంబ్లీ అబ్జర్వర్ తెర్నేకల్ సురేంద్ర రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నీరజారెడ్డి కుమార్తె పాటిల్ హిమవర్ష రెడ్డి కూడా ఆశావహుల రేసులో ఉన్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలోనూ గ్రూపు రాజకీయాలు నడుస్తున్నాయి. ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ రుద్రగౌడ్ గ్రూపుల మధ్య విభేదాలు నెలకొన్నాయి. దీంతో వారిద్దరూ వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పత్తికొండలోనూ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి అసమ్మతి సెగ తప్పడం లేదు. ఆ నియోజకవర్గంలో వైసిపి సీనియర్ నాయకులు పోచం రెడ్డి మురళీధర్ రెడ్డి ఎమ్మెల్యేతో కలవకుండా సొంతంగా పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కర్నూలు నియోజకవర్గంలో వైసిపీలో ముందు నుండి విభేదాలు కొనసాగుతున్నాయి. ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి మధ్య విభేదాలు నెలకొన్నాయి. నాయకులు కూడా రెండు గ్రూపులుగా ఏర్పడ్డారు.

కార్యక్రమాలు కూడా వేర్వేరుగా నిర్వహిస్తున్నారు. కోడుమూరు నియోజకవర్గంలోనూ అదే పరిస్థితి ఉంది. ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్, కూడా చైర్మెన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి మధ్య గ్రూపు రాజకీయాలు నడుస్తున్నాయి. నాయకులు రెండు గ్రూపులుగా విడిపోయారు. గ్రూపు రాజకీయాల మధ్య 2024 ఎన్నికల్లో వైసీపీకి ఎంత మేలు జరుగుతుందోనని ప్రజల్లో చర్చ నడుస్తోంది. నందికొట్కూరులో కూడా బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, ఎమ్మెల్యే ఆర్థర్ మధ్య తగాదాలున్నాయి.

కర్నూలు స్టేట్ కేన్సర్ హాస్పిటల్‌కు 247 పోస్టులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలులో అధునాతనమైన కేన్సర్ హాస్పిటల్ రూ90 కోట్లతో నిర్మాణం అవుతున్న సంగతి తెలిసిందే. అందులో రూ.54 కోట్లు కేంద్ర ప్రభుత్వం ఎన్‌పిసిడిసి ఫండ్స్ కింద ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ. 36 కోట్లతో నిర్మాణం దాదాపుగా అయిపోవచ్చింది. ఈ నేపద్యంలో స్టేట్ కేన్సర్ ఆసుపత్రి నిర్వహించేందుకు చాలామంది డాక్టర్లు, పారా మెడికల్ సిబ్బంది, నర్సులు, అవసరమవుతారు. వీటిని దృష్టిలో పెట్టుకొని ముందు జాగ్రత్తగా 247 పోస్టులను కొత్తగా మంజూరు చేసి భర్తీ చేసుకోవడానికి అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చింది. దీనితో రాయలసీమ వాసులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్యాన్సర్ ఆసుపత్రికి అడ్డంకులు తొలిగినట్లే. మహబూబ్ నగర్, రాయచూర్,బళ్ళారి, కడప, కర్నూల్, అనంతపురం ప్రకాశం జిల్లాల వారికి చాలా అందుబాటులో ఉంటుంది.

చట్టం అందరికీ సమానమే

చంద్రబాబు నాయుడు గుర్తించాలి
పోలీస్ అధికారుల సంఘం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

మాట్లాడుతున్న పోలీస్ అధికారుల సంఘం నాయకులు

సమాజంలో ఏ స్థాయి వ్యక్తులైనా ఎంతటి వ్యక్తులైనా చట్టం ముందు అందరూ సమానమే అని ఎపి పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జనకుల శ్రీనివాసరావు అన్నారు. గురువారం కర్నూలు జిల్లా పోలీస్ కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో ఆయన విలేకరుల సమావేశంలో సంఘం నాయకులతో కలిసి మాట్లాడారు. 14 సంవత్సరాలు ముఖ్య మంత్రిగా పనిచేసిన వ్యక్తికి తన మీద హత్య ప్రయత్నం జరిగితే సంబంధిత పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలనే విషయం తెలియదా? తనపై హత్యాయత్నం జరిగిందన్న విషయంలో ఏ పోలీస్ స్టేషన్లో కూడా ఫిర్యాదు ఇవ్వకుండా, నిన్నటి దినం ముదివేడు పిఎస్‌లో మాజీ ముఖ్యమంత్రి పై కేసు రిజిస్టర్ చేసి ఉన్నందున దాని నుండి తప్పించుకునేందుకు పోలీసులపై ఇటువంటి తప్పుడు ఆరోపణలు చేయడం మాజీ ముఖ్యమంత్రికి తగునా? అని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి నాయుని వారి చెరువు, హంద్రీనీవా కాలువ, పిచ్చలవాండ్లపల్లె ప్రాజెక్టు పనులను పరిశీలించే సమయంలో కొంతమంది పై రెచ్చగొట్టే వ్యాఖ్యలు, కార్యకర్తలను హింసకు ప్రేరేపించేలా చేసిన వ్యాఖ్యలు అంగళ్లు, పుంగనూరు వద్ద పోలీసులపై భౌతిక దాడులు జరిగేందుకు కారణం అయ్యారన్నారు. తనపై ఎఫ్ఐఆర్ నమోదు అవ్వగానే పోలీసులపై అవాస్తవాలు మాట్లాడడం సమంజసం కాదన్నారు. పోలీసులపై భౌతిక దాడులు చేసి రక్త గాయాలు చేసిన వ్యక్తులు ఎంతటి వారైనా ఉపేక్షించకుండా, చట్టం ముందు నిలబెట్టి సమాజంలో న్యాయం అందరికీ సమానమే అన్న సంకేతాలు పంపాలని రాష్ట్ర డిజిపిని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. పోలీస్ వ్యవస్థపై అసత్య ఆరోపణలు చేయడాన్ని ఖండిస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో పలువురు సంఘం నాయకులు పాల్గొన్నారు.

పోలకల్ లో డిఎస్‌పి రాత్రి బస

ప్రజాశక్తి- సి బెళగల్ : సి బెళగల్ మండలం పోలకల్‌లో డిఎస్‌పి విజయశేఖర్ గురువారం రాత్రి బసచేశారు. గ్రామస్తులతో సమీక్షించి వివాదాలకు, ప్రతికారాలకు దూరంగా ఉండాలని అన్నారు. అలాగే పల్లెలు ప్రశాంత జీవితాల వైపు వెళ్లాలని, అప్పుడే పిల్లలను తీర్చి దిద్దుకోగలరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ శ్రీధర్, ఎస్ఐ పీరయ్య సిబ్బంది పాల్గొన్నారు.

పోలకల్‌లో మాట్లాడుతున్న డిఎస్‌పి

సంక్షేమం, అభివృద్ధే వైసిపి ప్రగతి బాటలు

- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన, కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు

ప్రజాశక్తి - ఆదోని

సంక్షేమం, అభివృద్ధి వైసిపి ప్రభుత్వ ప్రగతి పట్టాలని రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ తెలిపారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాలులో ఆదోని, ఆలూరు నియోజకవర్గాల అభివృద్ధిపై జిల్లా, డివిజన్ స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పెండింగ్ ప్రాజెక్టుల పురోగతి, నియోజకవర్గాల్లోని ప్రధాన సమస్యలపై ప్రతి వారం కలెక్టర్ సమీక్షించి సంబంధిత ఎమ్మెల్యే, నియోజకవర్గ, జిల్లా యంత్రాంగం నేతృత్వంలో కృషి చేయాలని తెలిపారు. ఆలూరు నియోజకవర్గంలో రోడ్లు, జింకల పార్కు, ప్రభుత్వ భవనాలు, వసతి గృహాలు, జలవనరుల ప్రాజెక్టులు, నీటి పథకాల గురించి చర్చించారు. వెనుకబడిన కర్నూలు జిల్లా నియోజకవర్గాలపై ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ద్వారా మరింత దృష్టి పెట్టి, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి నేషనల్ హైవేలు గతంలో లేనన్ని సాధించుకున్నామని తెలిపారు. 68 చెరువుల ప్రాజెక్టును పూర్తి చేసి ముఖ్యమంత్రి చేతులమీదుగా త్వరలో జాతికి అంకితం చేస్తామన్నారు. సుంకేసుల నుంచి నీటి సరఫరా పెంచేందుకు రూ.120 కోట్లు, కోవిడ్-19 సమయంలో పేదలను కాపాడుకోవడమే లక్ష్యంగా చిత్తశుద్ధితో పనిచేశామని తెలిపారు. విద్య, వైద్యంతో అనేక కార్యక్రమాల ద్వారా ఎంతో ఖర్చు పెట్టామన్నారు. పత్తికొండలో రూ.30 కోట్లతో రోడ్డు విస్తరణ మొదలుపెట్టిన మూడేళ్లకు పట్టాలెక్కడమే అందుకు నిదర్శనమన్నారు. ఆరోగ్యశ్రీకి గత ప్రభుత్వంలో 300 జబ్బులకు రూ.1200 కోట్లు ఖర్చు పెడితే, వైసిపి ప్రభుత్వం 1200 జబ్బులకు రూ.3,500 కోట్లు ప్రతేడాది ఖర్చు పెడుతోందని తెలిపారు. గతంలో టైర్లు, ట్యూబ్లు, డ్రైవర్లు లేని అంబులెన్స్‌లు ఇప్పుడు కొత్త వాహనాలతో సేవలందిస్తున్నామన్నారు. ఆదోని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్, మున్సిపల్ చైర్మన్ శాంత, కమిషనర్ రఘునాథ్ రెడ్డి, డీఎస్పీ శివ నారాయణ స్వామి, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, వైస్ చైర్మన్లు నరసింహులు, కౌన్సిలర్లు సందీప్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, చలపతి, చిన్న పాల్గొన్నారు.

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బుగ్గన

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే పన్నులు వేసే విధానం రావాలి
- మీడియా ప్రతినిధులతో మంత్రి బుగ్గన

మైకులు పట్టుకొచ్చి అనవసరంగా ప్రశ్నలు వేస్తున్నారని, అనవసర ప్రశ్నలు వేసిన వారిపై పన్నులు వేసే విధానం రావాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ... అనేకమంది నేడు మైకులు పట్టుకొచ్చి అనవసరమైన ప్రశ్నలు వేస్తున్నారని తెలిపారు. ఇలాంటి వారిని అదుపు చేసేందుకు ప్రభుత్వాలు పన్నులు వేసే విధానం అమలు చేస్తే బాగుంటుందని అన్నారు. అప్పుడు ఎవరూ అనవసరంగా ఎవరినీ ప్రశ్నించరని తెలిపారు. ఆశ్చర్యానికి గురైన మీడియా ప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేస్తూ మంత్రిపై ప్రశ్నల వర్షం కురిపించారు. నంద్యాల జిల్లా అభివృద్ధి, అక్కడ జరుగుతున్న సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధి, రాష్ట్రవ్యాప్తంగా ప్రజల అభివృద్ధి, సంక్షేమం చేపట్టిన పథకాల గురించే ఎక్కువగా వివరించారు. ఆదోని డివిజన్‌లో వేదవతి ప్రాజెక్టు నిర్మాణం, వలస నివారణపై వేసిన ప్రశ్నలకు దాటవేత ధోరణితో సమాధానం చెబుతూ సమావేశాన్ని ముగించారు.

మైనారిటీ ఐటిఐ కళాశాల వెంటనే ప్రారంభించాలి : ఎస్ఎఫ్ఐ

మండలంలోని ఆరెకల్ గ్రామంలో ప్రభుత్వ మైనారిటీ ఐటిఐ కళాశాలను ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు భరత్ కుమార్, కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ... మైనారిటీ ఐటిఐ కళాశాల పనులు పూర్తయి దాదాపు మూడేళ్లు కావస్తున్నా ప్రారంభించకపోవడం దారుణమన్నారు. ఆదోనిలో ప్రభుత్వ ఐటిఐ కళాశాల లేక అనేక మంది విద్యార్థులు వేరే మండలానికి వెళ్లి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని మైనారిటీ ఐటిఐ కళాశాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రీమెటిక్ బీసీ గర్ల్స్ హాస్టల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు నాగరాజు, గౌస్, గణేష్, నాగరాజు, కుమార్, సత్య పాల్గొన్నారు.

వయస్సు సడలింపునకు అవకాశమివ్వాలి : ఆర్‌పిలు

పట్టణ పేదరిక నిర్మూలన పథకం కింద గత ఎన్నో ఏళ్లుగా ఆర్‌పిలుగా విధులు నిర్వహిస్తున్నామని, తమకు వయస్సు సడలింపు అవకాశం కల్పించాలని ఆర్‌పిలు మంత్రి బుగ్గనకు విన్నవించారు. మంత్రికి ఆర్‌పిలు సుశీల, శ్రీదేవి, ఫాతిమా, రత్న, ఉమా, రమాదేవి, లీలావతి, అరుణ వినతిపత్రం సమర్పించారు.

వాలంటీర్ వ్యవస్థ ఓ చరిత్ర

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

దేశ చరిత్రలో వాలంటీర్ వ్యవస్థ ప్రత్యేకమైన దని కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ హాఫీజ్ ఖాన్ అన్నారు. గురువారం నగరంలోని 45వ వార్డ్ 116వ సచివాలయం పరిధిలో ఉన్న లేబర్ కాలనీ వీధుల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆర్థికాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని అన్నారు. ఆర్థికాభివృద్ధితోనే పేదల బతుకులు మారుతాయని చెప్పారు. ఈ ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతి ఇంటికి మేలు చేసేలా పథకాలు తీసుకొచ్చి పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.

కర్నూలుకు సరైన నాయకుడిని ఎన్నుకోండి

టిడిపి కర్నూలు ఇంచార్జి టిజి.భరత్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

సరైన నాయకుడు పరిపాలించకపోతే ప్రజలకు ఇబ్బందులే ఉంటాయని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంఛార్జీ టిజి.భరత్ అన్నారు గురువారం నగరం లోని 16వ వార్డు పరిధిలోని స్వామిరెడ్డి నగర్లో ఆయన భవిష్యత్తుకు గ్యారెంటీ పేరుతో ఇంటింటికి తిరిగి ప్రజలను కలిశారు. వీధుల్లో తిరిగి మహిళలు, వృద్ధులు, యువకులను కలిసి వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య సమస్యలు, ఇళ్ల పట్టాల సమస్యలు, తాగునీటి ఇబ్బందుల గురించి ప్రజలు టిజి.భరత్‌తో మొరపెట్టుకున్నారు. అనంతరం టిజి.భరత్ ప్రజలతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలకు అంతా మంచే జరుగుతుందని చెప్పారు. సరైన నాయకత్వం ఉంటే ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూసుకుంటాడని వివరించారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే కర్నూలు ప్రజలకు సమస్యలు లేకుండా పరిపాలన అందిస్తానని చెప్పారు. వార్డుల్లో సమస్యలు తీరుస్తానని, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం బాగుపడుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి గెలిపించాలని భరత్ కోరారు. వార్డు ఇంఛార్జీ రామాంజనేయులు, బాబ్జి, క్రాంతి కిషోర్, చాంద్, శేఖర్, బాషా, సూరి, కోట్ల, మురళి, తదితర నేతలు పాల్గొన్నారు.

రైతులకు పూర్తి నష్టపరిహారం ఇవ్వాలి : ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ఎపిఐఐసి కింద సేకరించిన రైతుల భూములకు పూర్తి నష్టపరిహారం ఇవ్వాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ పరిపాలన అధికారి వెంకటేశ్వర్లుకు వినతిపత్రం సమర్పించారు. ఓర్వకల్లు మండలం కొమరోలు గ్రామంలో దళిత పేదలకు 1998 వ సంవత్సరంలో ఆనాటి ప్రభుత్వం భూమిలేని నిరుపేదలను గుర్తించి పట్టాలు ప్రదానం చేసిందన్నారు. అప్పటినుండి నేటి వరకు ఆ భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం ఓర్వకల్లు మండలంలో పరిశ్రమల ఏర్పాటు కోసం భూములు సేకరణ చేస్తున్నారన్నారు. కొమరోలు గ్రామంలో అన్ని పేద దళితులు లక్ష్మీదేవి, అయ్యమ్మ, రాజు మరో ఎనిమిది మంది భూములను ప్రభుత్వం తీసుకున్నదన్నారు. వారికి పూర్తి నష్టపరిహారం చెల్లించలేదన్నారు. నష్టపరిహారం ఇవ్వాలని గత ఐదు సంవత్సరాల నుండి కాళ్ళ అరిగేటట్లు తిరిగినప్పటికీ అధికారులలో స్పందన రావడం లేదన్నారు. మూడు ఎకరాలు, ఐదు ఎకరాలు పట్టా ఉన్నప్పటికీ కేవలం ఒక ఎకరా కొందరికి మరికొందరికి 80 సెంట్లుకు మాత్రమే నష్టపరిహారం చెల్లించారన్నారు. ఎన్నో సంవత్సరాలుగా కంప చెట్లు రాళ్ళు తొలగించి భూమిని సాగు చేయగా అటువంటి భూమికి నష్టపరిహారం పూర్తిస్థాయిలో ఇవ్వకపోవడం సమంజసం కాదన్నారు. వెంటనే పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని లేని పక్షంలో వారి భూములు వారికి ఆన్‌లైన్‌లో ఉండేటట్లు చూడాలని కోరారు. ఎఒ వెంకటేశ్వర్లు స్పందిస్తూ తప్పనిసరిగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

పలు అభివృద్ధి పనులకు స్టాండింగ్ కమిటీ ఆమోదం

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరపాలక సంస్థ నూతనంగా ఎన్నికైన స్టాండింగ్ కమిటీ సభ్యులతో మేయర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఆ సమావేశంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ల ప్రమోషన్లు, పలు అభివృద్ధి పనులపై చర్చించి ఆమోదాలు తెలిపారు. ఈ సమావేశంలో కమిషనర్ ఎ. భార్గవ్ తేజ, సంఘాల సుదర్శన్ రెడ్డి ,ఆత్మకూరు నాగలక్ష్మి రెడ్డి, నగరూరు శ్రీనివాసరావు, కె. పద్మలత, జిఎల్‌వి సుజాత లు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగాన్ని నిరసిస్తూ మహాధర్నా

రాష్ట్రంలో బిజెపి, జనసేన కలిసి పోటీ చేస్తాయి: టిజి.వెంకటేష్

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న టిజి.వెంకటేష్

గ్రామ పంచాయతీ నిధులు సర్పంచుల హక్కుల అని ఈ నిధులు దుర్వినియోగం అయ్యాయని గురువారం బిజెపి, జనసేన ఆధ్వర్యంలో ధర్నా చౌక్‌లో మహా ధర్నాను బిజెపి జిల్లా అధ్యక్షులు పోలంకి రామస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాధర్నాలో రాజ్యసభ మాజీ సభ్యులు టిజి. వెంకటేష్ మాట్లాడారు. కేంద్రం ప్రవేశపెట్టే ప్రతి బిల్లుకు వైఎస్ఆర్ పార్టీ మద్దతిస్తుందని అందుకే రాష్ట్రాభివృద్ధి కొరకు కేంద్రం అవసరమైనన్ని నిధులు సమకూరుస్తా ఉందన్నారు. రూ.8300 కోట్లు గ్రామాల అభివద్ధికి కేంద్రం కేటాయించిందన్నారు. గ్రామీణ రోడ్లకు, పాఠశాలల అభివృద్ధికి, మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రత్యేకంగా నిధులు కేంద్రం ఇచ్చిందన్నారు. ప్రజల సంక్షేమం కోసం, అభివృద్ధి కోసం ఖర్చు పెట్టాల్సిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టించి దుర్వినియోగం చేస్తుందని మండిపడ్డారు. ఈ పద్ధతి ఇలాగే కొనసాగితే కేంద్రం నిధులు ఇవ్వడం ఆపుతుందని, గ్రామీణ అభివృద్ధికి కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగించి, సరైన లెక్క చూపిస్తే మరిన్ని నిధులు పంచాయతీలకు కేంద్రం ఇచ్చే అవకాశం ఉందన్నారు. అభివద్ధిలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై బిజెపి, జనసేన పార్టీలు కలిసి పోరాటం చేస్తున్నాయని, వచ్చే ఎన్నికల్లో ఈ రెండు పార్టీలు కలిసే పోటీ చేస్తాయన్నారు. జనసేన జిల్లా నాయకులు సురేష్‌బాబు మాట్లాడుతూ మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని వైసిపి ప్రభుత్వం వాలంటరీల వ్యవస్థను తీసుకొచ్చి తుంగలో తొక్కుతుందని విమర్శించారు. ధర్నా అనంతరం బుధవారపేట, సర్వజన వైద్యశాల మీదుగా కలెక్టరేట్ కు ర్యాలీగా వచ్చి గేటు ముందు నిరసన తెలిపారు. డిఆర్ఒ నాగేశ్వర రావు కు వినతిని అందించారు. బిజెపి జిల్లా నాయకులు కపిలేశ్వరయ్య, డాక్టర్ వినుషా రెడ్డి, కాలింగి నరసింహవర్మ, జనసేన నాయకులు హర్షద్, సుధాకర్, బజారి పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మీప్రసాద్

అమీలీయోలో అరుదైన శస్త్ర చకిత్స

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

అనంతపురం జిల్లా ఉరవకొండ మండలానికి చెందిన నాగార్జున (52) గవర్నమెంట్ టీచర్‌గా విధులు నిర్వహిస్తూ ఉంటారు. గత నెల అనంతపూర్ లోని ప్రవేట్ హాస్పిటల్ లో కడుపులో నొప్పి అని చేరగా అక్కడి డాక్టర్లు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందని ట్రీట్మెంట్ చేయడానికి ముందుకు రాలేదు. దీంతో ఆయన కర్నూలు నగరంలోని అమీలియో హాస్పిటల్‌కు గత నెల 24న అర్ధరాత్రి 12:45 నిమిషాలకు వచ్చారు. వెంటనే డాక్టర్ రామచంద్రయ్య పరీక్షించి పిత్తాశయం పూర్తిగా కుళ్లిపోయి. గంగ్రేనియస్‌గాల్ బ్లాడర్, గుండె పరిస్థితి కూడా బాగాలేదని నిర్ధారణకు వచ్చారు. వెంటనే డాక్టర్ శస్త్ర చికిత్స చేసి ప్రాణలు కాపాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్ మీట్‌లో డాక్టర్ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ 90 శాతం డెత్ రేటు ఉన్న ఈ కేసును ఎవరు తీసుకోని సమయంలో మా దగ్గర అన్ని రకాల ఎక్విప్‌మెంట్, సూపర్ స్పెషాలిటీ సౌకర్యాలు , ప్రతిభా వంతులైన డాక్టర్లు ఉన్నందున కేసు టేకప్ చేసి విజయవంతంగా పూర్తి చేశా మన్నారు. ఈ సందర్భంగా ఆయన డాక్టర్లకు కతజ్ఞతలు తెలిపారు. ఈ సమా వేశంలో పేషెంట్ నాగరాజు మాట్లాడుతూ తాను ఈ సమస్యతో చాలా సంవత్స రాల నుంచి బాధపడుతున్నానని, ఎక్కడికి వెళ్లినా ఎవరు నయం చేయ లేదని, ఈ అమీలియో హాస్పిటల్లో డాక్టర్లు తన సమస్యను తీర్చారని వారికి కృతజ్ఞతలు తెలిపారు.

కెవిఆర్ అధ్యాపకురాలికి డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కెవిఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల అధ్యాపకురాలు జి.సునీతకు కంప్యూటర్ సైన్సులో డాక్టరేట్ పొందారు. ఎస్‌కె యూనివర్సిటీ అనంతపురం ప్రొఫెసర్ ఎస్. గీతాంజలి పర్యవేక్షణలో 'డిజైన్ అండ్ డెవలప్ మెంట్ ఆఫ్ ఫీచర్ సెలక్షన్ ఆండ్ క్లాసిఫికేషన్ అల్గారిదమ్స్ ఫర్ మల్టిపుల్ డిసీజ్ డయాగ్నోసిస్ ' అంశంపై పరిశోధన కు డాక్టరేట్ పట్టాను ప్రదానం చేస్తున్నట్లు వర్సిటీ ఉన్నతాధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరా శాంతి సునీతకు అభినందనలు తెలిపారు.

ఓటరు జాబితా ఇంటింటి సర్వే శరవేగం చేయాలి

ప్రజాశక్తి-సి బెళగల్

గ్రామాల్లో ఓటరు జాబితా ఇంటింటి సర్వేను శరవేగం చేయాలని తహసీల్దార్ శేషఫణి, బిఎల్ఒ లకు సూచించారు. గురువారం పరిషత్‌లో సమీక్షించి ఓటరు జాబితాలో ఎలాంటి అవకతలకు తావు ఇవ్వరాదని పేర్కొన్నారు. మరణించిన వారివి తక్షణమే తొలగించి, కొత్త ఓటరు దరఖాస్తులు స్వీకరించాలన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న తిరుమల్‌రెడ్డి

అల్లర్ల నియంత్రణలో కేంద్రం విఫలం

- సింగిల్ విండో ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే ఎర్రకోట

- కొత్త పాలకమండలి అధ్యక్షులుగా తిరుమల్ రెడ్డి

ప్రజాశక్తి - గోనెగండ్ల

మణిపూర్ రాష్ట్రంలో హింసాత్మక ఘటనలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి విమర్శించారు. గురువారం స్థానిక బాషా ఫంక్షన్ హాల్‌లో గోనెగండ్ల వ్యవసాయ సహకార సొసైటీ నూతన పాలకమండలి అధ్యక్షులుగా గంజిహళ్లి గ్రామానికి చెందిన ఎస్.తిరుమల్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు జగన్మోహన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. మణిపూర్‌లో జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలను నియంత్రించడంలో బిజెపి విఫలమైందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పారా మిలటరీ దళాలను ఉపయోగించి హింసాత్మక సంఘటనలను అణిచివేసి పరిస్థితిని అదుపులోకి తేవచ్చని అన్నారు. హిందుత్వాన్ని ఉపయోగించి ప్రజలను వేరు చేసి రాబోయే ఎన్నికల్లో లబ్ది పొందాలని బిజెపి చూస్తోందని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ... 2009 నుంచి తిరుమల్‌రెడ్డి చెన్నకేశవరెడ్డి వెంట ఉండడంతోపాటు వైసిపి అభివృద్ధికి పనిచేశారని తెలిపారు. జాగ్రత్తగా పనిచేసి రైతులకు సేవలందించే పదవికి న్యాయం చేయాలని చెప్పారు. వైసిపి నాయకులు వెంకటనారాయణ, టి.జంబిదేవమ్మ, ఎనిబి.మన్సూర్, భాస్కర్ రెడ్డి, దొరబాబు నాయుడు, గంజిహళ్లి మహేష్ రెడ్డి పాల్గొన్నారు.

వాల్మీకుల మధ్య గొడవలు సృష్టించవద్దు

- ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ

ప్రజాశక్తి - చిప్పగిరి

సమావేశంలో మాట్లాడుతున్న గుమ్మనూరు నారాయణ

ప్రశాంతంగా ఉన్న చిప్పగిరి మండలంలో వాల్మీకుల మధ్య గొడవలు సృష్టించవద్దని ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ తెలిపారు. గురువారం ఆయన మండల కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వాల్మీకుల మధ్య గొడవలు సృష్టించడానికి టిడిపి ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ ప్రయత్నిస్తున్నారని, మండలంలో వారి రాజకీయ ఎత్తుగడలు సాగవని తెలిపారు. కుందనగుర్తి గ్రామంలో వార్డు నామినేషన్ సరళిని పరిశీలించడానికి గ్రామంలోకి వెళితే కోట్ల సుజాతమ్మ ఆదేశాలతో సర్పంచి కొండా పురుషోత్తం, వారి అనుచరులు తమపై దాడికి రావడం ఏమిటని ప్రశ్నించారు. తాము కోరుకునేది ఒక్కటేనని, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ గ్రామాలు ప్రశాంతంగా ఉండాలని కోరుకుంటున్నారని చెప్పారు. ఆయన అడుగుజాడల్లోనే తాము కూడా వెళ్తున్నామన్నారు. జయరామ్‌పై గెలవలేక వాల్మీకుల మధ్య గొడవలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని ఆలోచిస్తున్నారని తెలిపారు. అవి ఎప్పటికీ నెరవేరవని, వీలైతే నేరుగా జయరామ్‌పై పోటీ చేయాలని, మీరు కూడా చేయండని ఆమెకు సవాల్ విసిరారు. అప్పుడు వాల్మీకుల బలమేంటో తెలుస్తుందన్నారు. వైసిపి కన్వీనర్ రంగస్వామి, అసెంబ్లీ బూత్ కన్వీనర్ రాజన్న, సేవన్న, బెల్గల్ గోవర్ధన్, మాజీ సర్పంచి కొండా శేఖర్, తిరుమలేష్, రాముడు, సతీష్, అజయ్ పాల్గొన్నారు.

ఆర్‌డిటి సంస్థకు ఎమ్మెల్యే విరాళం

ప్రజాశక్తి - కోసిగి

ఆర్‌డిటి సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని, ఆర్‌డిటి సంస్థ చేపడుతున్న 'భారతీయుల కోసం భారతీయులు' కార్యక్రమం కోసం మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి రూ.2 లక్షలు విరాళంగా గురువారం ఎమ్మెల్యే స్వగృహంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కౌతాళం, కోసిగి, మంత్రాలయం మండలాల్లో ఉన్న పేదలకు సేవ చేస్తున్న సంస్థ అని కొనియాడారు. నగదును సంస్థ సిబ్బంది రీజనల్ డైరెక్టర్ రామేశ్వర్, ఎటిఎల్ కృష్ణయ్యకు అందజేశారు. జంపాపురం సర్పంచి హారోన్, బసిరెడ్డి, రంగారెడ్డి, చిన్న బసిరెడ్డి, దొడ్డి నరసన్న, సంస్థ సిబ్బంది బసవరాజు పాల్గొన్నారు.

ఆర్‌డిటి సంస్థ సిబ్బందికి నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే

విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలి

- కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

విద్యార్థులందరూ ఆల్బెండజోల్ మాత్రలు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. సంవత్సరానికి రెండుసార్లు పిల్లలతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించడం ద్వారా వారిలో రక్తహీనత, పోషకాహార లోపం తొలగించవచ్చని తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, జూనియర్ కళాశాలలో పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. పిల్లల శరీరంలో నులిపురుగులు ఎక్కువ సంఖ్యలో ఉండడం వల్ల ఆక్సిజన్, హిమోగ్లోబిన్ శాతం తగ్గి, తరచుగా అనారోగ్యానికి గురవుతారని చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకుని 1 నుంచి

ఆదోనిలో విద్యార్థులకు మాత్రలు అందజేస్తున్న కలెక్టర్ సృజన

19 ఏళ్ల పిల్లలందరూ తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిఎంహెచ్ఒ రామగిడ్డయ్య, ఆర్‌బిఎస్‌కె (కోఆర్డినేటర్) హేమలత, డిఎంఒ నూకరాజు, డిప్యూటీ డిఎంహెచ్ఒ రఘురామిరెడ్డి, టిబి అధికారి భాస్కర్, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున పాల్గొన్నారు. అలాగే మండలంలోని మదిరే గ్రామంలో అంగన్వాడీ, పాఠశాల విద్యార్థులకు, చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో ఎఎన్ఎంలు పుష్పలత, లక్ష్మీ, ఎంఎల్‌హెచ్‌పి శ్రీకృష్ణవేణి విద్యార్థులకు మాత్రలు వేసి మాట్లాడారు. **చిప్పగిరి** మండలంలోని అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో ఎఎన్ఎంలు, ఆశాలు, అంగన్వాడీ టీచర్లు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను వేయించారు. ప్రభుత్వాస్పత్రి డాక్టర్ జమీల్ అహ్మద్, సిహెచ్ఒ వెంకటేశ్వర్లు, నేమకల్లు సచివాలయ ఎఎన్ఎం సువర్ణ, అంగన్వాడీ టీచర్ బాలరంగమ్మ మాట్లాడారు. ఈ ఒక్కరోజే దాదాపు 95 శాతం పిల్లలు ఆల్బెండజోల్ మాత్రలు వేయించుకున్నారని తెలిపారు.

చిప్పగిరిలో మాత్రలు పంపిణీ చేస్తున్న సిబ్బంది

టిడిపి అధికారం కోసం

కార్యకర్తలు కృషి చేయాలి : టిడిపి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరురూరల్

రాష్ట్రంలో టిడిపిని అధికారంలోకి తీసుకు రావడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఎమ్మెల్సీ, టిడిపి జిల్లా అధ్యక్షులు బిటి.నాయుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర్ రెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం పట్టణంలోని కుర్ని కల్యాణ మండపంలో నియోజకవర్గంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలు, తెలుగు యువత సభ్యులు, నందమూరి అభిమానులు, టిఎన్ఎస్ఎఫ్ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ ఆరు నెలలు ప్రతి కదలికపైనా ప్రతి కార్యకర్త నిశితంగా పరిశీలించాలని తెలిపారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు భవిష్యత్తు భరోసా కోసం ప్రకటించిన పథకాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. జిల్లా టిడిపి అధ్యక్షులుగా ఎన్నికైన ఎమ్మెల్సీ బిటి.నాయుడును, టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన సోమిశెట్టి వెంకటేశ్వర్లును శాలువా, గజమాలతో సన్మానించారు. కురువ సాధికారిక కమిటీ మెంబర్ తిమ్మాపురం వెంకటేష్, చెన్నాపురం నాగరాజు, కలగట్ల ఈరన్న, దైవందిన్నె వెంకటేష్, లోకేష్, బనవాసి నరసింహులు, అబ్రహాం, వీరనాగప్ప, మల్కాపురం రంగస్వామి, నాగరాజు పాల్గొన్నారు.

బిటి.నాయుడును, సోమిశెట్టిని సన్మానిస్తున్న నాయకులు

అందరి సహకారంతో ప్రజాసేవ

- ఘనంగా అప్సర్ బాషా పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ఆదోని

పార్టీలకతీతంగా అందరి సహకారంతో ప్రజాసేవ చేస్తున్నానని, భవిష్యత్తులో ఇలాగే అందరూ తనకు సహకరించాలని టిడిపి మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు సయ్యద్ అప్సర్ బాషా తెలిపారు. గురువారం తన స్వగృహం వద్ద, టిడిపి కార్యాలయంలోనూ అప్సర్ బాషా పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ముందుగా టిడిపి కార్యాలయం వద్ద నియోజకవర్గ ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన స్వగృహం వద్ద పట్టణంలోని ముస్లిం మత పెద్దలు, ఇతర కులాలకు చెందిన వారు, అన్ని రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో వేడుకలు నిర్వహించారు. భారీ కేక్‌ను మీనాక్షి నాయుడు, ఖతిబ్ సాబ్ జునేత్ హస్మి, ఖాజీ సాబ్ అల్తాఫ్ హుస్సేన్ ఆధ్వర్యంలో అప్సర్ బాషా కేక్ కట్ చేశారు. మార్కెట్ యార్డు ఛైర్మన్ మజర్ అహ్మద్, టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ కృష్ణమ్మ, మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ భాస్కర్ రెడ్డి, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు దేవేంద్రప్ప, పెద్ద మసీదు ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ సౌదీ రావుఫ్, టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు, ఎల్ఐసి డిస్ట్రిబ్యూటర్ కమిటీ మాజీ ఛైర్మన్ రామస్వామి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ దేవిశెట్టి ప్రకాష్, కాంగ్రెస్ నాయకులు నీలకంఠప్ప, కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా ఇన్‌ఛార్జీ నూర్, జాలిమంచి సర్పంచి గోవింద పాల్గొన్నారు.

అప్సర్ బాషాతో కేక్ కట్ చేయిస్తున్న మీనాక్షి నాయుడు

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి నారాయణరెడ్డి

ప్రజాశక్తి-ఆలూరు

వర్షాలు ఆశించిన స్థాయిలో లేక, నకిలీ విత్తనాల వల్ల పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి నారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం అరికెర గ్రామంలో నష్టపోయిన పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈఏడాది ఖరీఫ్ సీజన్‌లో పత్తి, కంది, ఆముదం పంటలు సాగు చేసినా వర్షాల్లేక ఎండిపోతున్నాయని చెప్పారు. ఎర్ర తెగుళ్లు, నకిలీ పత్తి విత్తనాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. గత రెండేళ్లు పంటలు చేతికందక రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. పత్తి పంట సాగు చేసి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమాన్ని విస్మరించాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. వేదవతి ప్రాజెక్టుకు నిధులు కేటాయించి నిర్మాణ పనులను చేపట్టాలని కోరారు. టిడిపి జిల్లా నాయకులు నరసప్ప, భాస్కర్, నాగరాజు, పట్టణ అధ్యక్షులు చంద్రశేఖర్, టిడిపి నాయకులు ఆంజనేయ, బొగ్గు రాముడు, మసాల జగన్, కుమార్, ఉరుకుందు పాల్గొన్నారు.

పత్తి పంటను పరిశీలిస్తున్న నాయకులు

రైతుల సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి తెలిపారు. గురువారం ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి తన నివాసంలో ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ సాగునీటి పథకం కింద నియోజకవర్గంలో రైతులకు స్ప్రింక్లర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్ప్రింక్లర్లు అనేవి పంటలకు సాగు నీటిని అందించేందుకు ఉపయోగపడతాయని తెలిపారు. శీతలీకరణ వ్యవస్థగా లేదా ధూళి, నియంత్రణకు నీటిని చిమ్మే సాధనాలని చెప్పారు.

రోడ్డు పనులు వేగవంతం

ప్రజాశక్తి - కౌతాళం

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రాల్లో ఒకటైన శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి శ్రావణమాస ఉత్సవాలు సమీపిస్తుండడంతో రోడ్డు మరమ్మతు పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు ఎరిగేరి గ్రామం నుంచి ఉరుకుంద వరకూ రోడ్డు పనులు చేపడుతున్నారు. ఉరుకుంద ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ నాగరాజు గౌడ్ ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ దృష్టికి తీసుకెళ్లడంతో జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి మరమ్మతు పనులకు నిధులు మంజూరు చేశారు. గురువారం వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి మాట్లాడుతూ... భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా పనులు చేపడతామన్నారు. రోడ్డు పనులు ముమ్మరంగా చేస్తున్నామన్నారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.జ్ఞానేశ్వర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురం జిల్లా గుంతకల్ డిగ్రీ కళాశాలలో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఆలూరుకు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అధ్యాపకులతో మమేకమై కళాశాల అభివృద్ధికి, విద్యార్థుల ఉత్తీర్ణతకు కృషి చేస్తామని తెలిపారు. అధ్యాపకులు, సిబ్బంది సలహాలు, సూచనలు తెలియజేసి కళాశాలను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలని కోరారు. అనంతరం ప్రిన్సిపల్‌ను అధ్యాపకులు, సిబ్బంది సన్మానించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.మాధవి, అధ్యాపకులు సుశీల, చిరంజీవి, రాఘవేంద్ర, ముద్దప్ప, జూనియర్ సహాయకులు నాగేశ్వరవు, శేఖర్, ప్రణయ్ పాల్గొన్నారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE, ADONI
LA NO: 14/2023 IN O.S. No. 143/2013

Between:
Burujula Lakshmi Devi and others. ... petitioners.
AND
B Pakkirappa and another. ... Respondents

NOTICE

To:
1. B. Padmavathamma,W/O Late B. Pakkirappa, Hindu, major. (R-3)
2. B.Kistamma, D/O Late B. Pakkirappa, Hindu, major, (R-5).
3. B. Shashikala, D/O Late B. Pakkirappa, Hindu, major. (R-6).
4. B. Vijayalakshmi, W/O Late B. Rajendra Prasad, Hindu, major. (R-7).
5. B. Shashidar, S/O Late B. Rajendra Prasad, Hindu, major, (R-8).
6. B. Vamshi, S/O Late B. Rajendra Prasad, Hindu, major (R-9).
7. B. Kranthi, D/O Late B. Rajendra Prasad, Hindu, major, (R-10).
8. Chandramma W/o Late B. Pakirappa, Hindu major (R-11).
9. B. Dhanlaxmi, D/O Late B. Rajendra Prasad, Hindu, major, (R-12).
10. B. Parvathi, D/O Late B. Rajendra Prasad Hindu, major, (R-13).
11.B. Krishnaveni, W/O Late B. Vijay Kumar, Hindu, major, Resident (R-14).
12.B. Hari Krishna, S/O Late B.Vijay Kumar, Hindu, major (R-15).
13. B. Vandana, D/O Late B. Vijay Kumar, Hindu, major, (R-16).

All are resident of Resident of Molagavalli Village, Alur mandal, Kurnool District.

Whereas the above named petitioner has filed the above application in the suit against You no.1 to 13 The Hon'ble Court was pleased to permit the petitioner to serve the summons to you no.1 to 13 by way of paper publication. Therefore you no.1 to 13 are hereby directed to appear before this Hon'ble Court on 22/08/2023 at 10:30 AM either in person or through your Advocate and file your objections if any, failing which the matter will be decided in your absence.

L..K. Jeevan Singh BE, LL.B
Advocate Plaintiff, Adoni.

ప్రాథమిక విద్యావ్యవస్థను కాపాడుకుందాం

- యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాగమణి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

జాతీయ విద్యావిధానం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం 70 ఏళ్లుగా గ్రామీణ ప్రాంతాల్లో విద్యనందిస్తున్న ప్రాథమిక పాఠశాలలను కనుమరుగు చేసి, బడుగు, బలహీన వర్గాల పిల్లలను చదువుకు దూరం చేసే ప్రయత్నం చేస్తోందని, ప్రాథమిక పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.నాగమణి, జిల్లా అధ్యక్షులు జె.ఎల్లప్ప కోరారు. గురువారం యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రాంతీయ కార్యాలయంలో యుటిఎఫ్ జెండాను సీనియర్ నాయకులు భాస్కర్ బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగమణి, ఎల్లప్ప, భాస్కర్ బాబు, దావీదు మాట్లాడారు. చెన్నుపాటి లక్ష్మయ్య ఆశయాలతో అప్పారి వెంకట స్వామి, మైనేని వెంకటరత్నం, దాచూరి రామిరెడ్డి నాయకత్వంలో యుటిఎఫ్ ఆవిర్భవించిందని తెలిపారు. ఉపాధ్యాయులకు రీ గ్రూపింగ్ స్కేల్, అప్రెంటీస్ విధానానికి రెండు నోషనల్ ఇంక్రిమెంట్స్, అప్రెంటీస్ విధానం రద్దు, కౌన్సెలింగ్ విధానాన్ని సాధించడంలో యుటిఎఫ్ చేసిన పోరాటాలతోనే సాధ్యమయ్యాయని చెప్పారు. జిల్లా కార్యదర్శులు దేవపాల్, నరసింహులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎం.నాగరాజు, నాయకులు ఎం.హనుమంతు, భీమేష్, రాఘవేంద్ర, శాంతిరాజు, జ్ఞానప్రకాష్, తాతయ్య, ఎం.రాజు, చంద్రపాల్, బాబు, ఎస్.నాగరాజు, వీరభద్రయ్య, హుస్సేని, సుధాకర్, లింగమూర్తి, శివకుమార్, రవికుమార్, ప్రకాష్, లతీఫ్ పాల్గొన్నారు.

జెండాను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

రైతులకు అండగా సహకార బ్యాంకులు

- బెల్డోన సహకార బ్యాంకు ఛైర్మన్ మల్లికార్జున

ప్రజాశక్తి - చిప్పగిరి

ఛైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మల్లికార్జున

రైతులు మంచి పంటలు పండించుకోవడానికి, సరైన సమయంలో పెట్టుబడులు పెట్టేందుకు సహకార బ్యాంకుల్లో రైతులకు రుణాలు అందజేస్తున్నామని బెల్డోన సహకార సంఘం ఛైర్మన్ ఉనేబాదు మల్లికార్జున తెలిపారు. గురువారం కర్నూలు నగరంలో కెడిసిసి ఛైర్మన్ ఎస్వీ.విజయ మనోహరిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సహకార బ్యాంకులు రైతులకు ఎల్లవేళలా అండగా ఉంటాయని తెలిపారు. బ్యాంకు స్థితిగతులపై, రైతు ఆర్థిక వృద్ధిపై ఛైర్మన్‌తో చర్చించారు. తమ బెల్డోన సహకార బ్యాంకుకు విరివిగా రుణాలు అందజేయాలని కోరారు.

రైతులకు సకాలంలో రుణాలు అందిస్తాం

- సొసైటీ ఛైర్మన్ గోవర్ధన

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరి సొసైటీ బ్యాంకు ద్వారా రైతులకు సకాలంలో రుణాలందించి ఆదుకుంటున్నామని సొసైటీ ఛైర్మన్ గోవర్ధన తెలిపారు. గురువారం జిల్లా కెడిసిసి బ్యాంకు ఛైర్మన్ ఎస్వీ.విజయ మనోహరిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం పెద్దపీట వేసిందని తెలిపారు. వైఎస్ఆర్ రైతు నేస్తం ద్వారా రైతులకు రుణాలందించి సహాయ, సహకారాలు చెప్పారు. ఆస్పరి సొసైటీ సిఇఒ అశోక్, ముత్తుకూరు సర్పంచి తోయాచప్ప పాల్గొన్నారు.

ఛైర్మన్‌ను కలిసిన సొసైటీ ఛైర్మన్ గోవర్ధన

వైసిపి అరాచక పాలనలో దౌర్జన్యాలు

- టిడిపి ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ

ప్రజాశక్తి-ఆలూరు

వైసిపి అరాచక పాలనలో దౌర్జన్యాలు ఎక్కువయ్యాయని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ తెలిపారు. గురువారం ఆలూరు టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలో పంచాయతీ, వార్డు ఉప ఎన్నికల్లో వైసిపి నాయకులు దౌర్జన్యాలకు పాల్పడుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారన్నారు. నామినేషన్లకు

సమావేశంలో మాట్లాడుతున్న కోట్ల సుజాతమ్మ

అవసరమైన సర్టిఫికెట్లు ఇవ్వకుండా పంచాయతీ కార్యదర్శులను విధుల్లో లేకుండా చేయడంతో వైసిపి పతనం మొదలైందన్నారు. రాష్ట్రాన్ని రావణకాష్టంగా వైసిపి ప్రభుత్వం అక్రమ కేసులు, దాడులు, వేధింపులకు పాల్పడుతోందని తెలిపారు. ప్రభుత్వానికి ప్రజలు త్వరలోనే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. టిడిపి జిల్లా నాయకులు నరసప్ప, భాస్కర్, సీనియర్ నాయకులు తిమ్మయ్య, నగరడోన కృష్ణప్ప, మాజీ జడ్‌పిటిసి మురళీ రెడ్డి, పట్టణ అధ్యక్షులు చంద్రశేఖర్, గూళ్యం రామాంజనేయులు, ముద్దరంగ, ఎల్లప్ప, ఆంజనేయ పాల్గొన్నారు.

ఆత్మానంద మృతి పార్టీకి తీరని లోటు

ఆస్పరి : మండలంలోని కారుమంచి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు ఆత్మానంద (45) మృతి పార్టీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ వైకుంఠం మల్లికార్జున చౌదరి, టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ కుమారుడు గిరి మల్లేష్ గౌడ్ తెలిపారు. ఆత్మానంద మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆత్మానంద రోజు లాగానే ఇంటి నుంచి పొలానికి వెళ్లారు. పొలం దగ్గర హఠాత్తుగా గుండె నొప్పి రావడంతో ఆదోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆయనకు భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ... పార్టీ కార్యక్రమాల్లో ఎంతో చురుకుగా పాల్గొనే వారని, 2006లో ఆయన భార్య లక్ష్మీదేవిని సర్పంచిగా గెలిపించుకున్నారని తెలిపారు. వైసిపి మండల కన్వీనర్ పెద్దయ్య, మాజీ మండల కన్వీనర్ రామాంజనేయులు, టిడిపి మండల కన్వీనర్ పరమా రెడ్డి, వైసిపి నాయకులు రాజన్న గౌడ్‌లు నివాళులర్పించారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

ప్రజాశక్తి - కౌతాళం

ఇటీవల ఎన్నికల కమిషన్ ఖాళీ అయిన గ్రామ పంచాయతీ, వార్డు సభ్యుల ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేసింది. గురువారం చివరిరోజు కావడంతో మండలంలోని 4 పంచాయతీల్లో వార్డు సభ్యులు, బదినేహాల్ సర్పంచికి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎంపిడిఒ సుబ్బరాజు తెలిపారు. బదినేహాల్ సర్పంచి స్థానానికి హెచ్.వీరేష్, హెచ్.వీరేష్, మాల పెద్ద నరసప్ప, మాల దుర్గప్పలు నాలుగు నామినేషన్లు దాఖలు చేశారు. కుంబాలనూర్ గ్రామంలో వార్డు సభ్యులకు జి.లక్ష్మీ, కెఅయ్యన్న, రౌడూర్ గ్రామంలో వార్డు సభ్యులకు ఎం.వీరేష్, ఎం.వీరేష్, చాకలి లింగమ్మ, కౌతాళం గ్రామంలో వార్డు సభ్యులకు బోయ ఉరుకుందమ్మ, గోతులదొడ్డి గ్రామంలో పూజారి లక్ష్మి నామినేషన్ దాఖలు చేశారు.

నామినేషన్‌కు భారీగా తరలివచ్చిన కార్యకర్తలు

మండలంలోని బదినేహాల్ సర్పంచి స్థానానికి నామినేషన్ వేసేందుకు వైసిపి నాయకులు రవీంద్ర రెడ్డి (రవి గౌడ్), మండల కోఆప్షన్ సభ్యులకు మాబుసాబ్, ఉప సర్పంచి ప్రసన్న గౌడ్ ఆధ్వర్యంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు వైసిపి మద్దతుదారులు మాల పెద్ద నరసప్ప, మాల దుర్గప్ప నామినేషన్లు వేశారు. గ్రామంలోని నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి రావడంతో గ్రామస్తుల మద్దతు కనిపించింది. వైసిపి మద్దతుదారులను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని, ఈ గెలుపు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి బహుమానంగా అందజేస్తామని నాయకులు పేర్కొన్నారు.

పెద్దకడబూరు : ఇటీవల ఎన్నికల కమిషన్ ఖాళీ అయిన పంచాయతీ, వార్డు సభ్యుల ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేసింది. గురువారం చివరిరోజు కావడంతో మండలంలోని కల్లుకుంట గ్రామంలో సిపిఎం బలపరిచిన 11వ వార్డు సభ్యులకు హరిజన రాణి నామినేషన్ వేశారు. ఎన్నికల అధికారి ఎం.వరప్రసాద్, పంచాయతీ సెక్రటరీ శారదమ్మకు నామినేషన్ పత్రాలను అందజేశారు. అలాగే సిపిఎం మండల కార్యదర్శి ఈడిగ తిక్కన్న, గ్రామ పెద్దలు ఈరన్న, కటిక చాంద్ బాషా, ఆశీర్వాదం పాల్గొన్నారు.

బదినేహాలులో నామినేషన్ వేస్తున్న అభ్యర్థులు

పెద్దకడబూరులో నామినేషన్ వేస్తున్న అభ్యర్థులు

12న ఫ్యాప్టో ధర్నా జయప్రదం చేయండి

- ఎస్‌టియు, డిటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - దేవనకొండ

ఫ్యాప్టో ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 12న కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న ధర్నాను జయప్రదం చేయాలని ఎస్‌టియు, డిటిఎఫ్ నాయకులు జ్యోతి, రోషన్న, విక్టర్ కోరారు. గురువారం మండలంలోని తెర్నేకల్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిఒ 117ను వెంటనే రద్దు చేయాలని కోరారు. బదిలీలు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు జీతాలు చెల్లించాలన్నారు. ఈనెల 12న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాలో ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు.

'మహాసభలను జయప్రదం చేయండి'

ప్రజాశక్తి-ఆలూరు

ఈనెల 21, 22న విజయవాడలో జరిగే 21వ మహాసభలను జయప్రదం చేయాలని తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు మోహన్, బాలకృష్ణ కోరారు. గురువారం తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో మహాసభ గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల, ఒప్పంద ఉద్యోగుల, కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హాజరు కానున్నట్లు చెప్పారు. ఎపి ఎన్‌జిఒస్ తలపెట్టిన ఈ మహాసభలను ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్లు విజయవంతం చేయాలని కోరారు. ఆలూరు తాలూకా ట్రెజరర్ శేఖర్, ఎపి ఎన్‌జిఒ సలహాదారుడు ఉల్లిగప్ప, కిరణ్ పాల్గొన్నారు.

మల్లప్పకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఎమ్మెల్యేగా అవకాశమిస్తే అభివృద్ధి చేస్తాం : జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్ప

ప్రజాశక్తి - ఆదోని

ఎమ్మెల్యేగా తనకు ఒక్కసారి అవకాశమిస్తే అభివృద్ధి, సంక్షేమం పూర్తిస్థాయిలో అందించి ఆదోనిలో అన్ని రకాల మార్పులకు నాంది పలుకుతానని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జీ మల్లప్ప తెలిపారు. గురువారం పట్టణంలోని మంగళ ఆంజనేయ స్వామి దేవాలయం ఫంక్షన్ హాలులో మల్లప్ప పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లప్ప మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రజలు మాట్లాడేందుకు కూడా స్వేచ్ఛ లేదని తెలిపారు. తన పుట్టినరోజు సందర్భంగా ఒక అభిమాని తనకు పెద్ద ఎత్తున ఫ్లెక్సీని ఏర్పాటు చేస్తే అధికార పార్టీ నాయకులు ఒత్తిడి తెచ్చి మరి తొలగించే విధంగా చేశారని చెప్పారు. ఎదిరిస్తేనే రాజకీయాల్లో కొనసాగగలమని, చావుకు తెగించి జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాజకీయాల్లో కొనసాగుతున్నారని తెలిపారు. వారాహి యాత్ర నిర్వహిస్తున్నారని, అందరూ త్యాగాలకు సిద్ధం కావాలని, పవన్ ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు.

పచ్చని చెట్లు.. ప్రగతికి మెట్లు

- సిడిసిఎల్ ఆర్‌సి సురేష్‌బాబు

ప్రజాశక్తి - హాలహార్వి

పచ్చని చెట్లు.. ప్రగతికి మెట్లు అని సిడిసిఎల్ ఆర్‌సి సురేష్‌బాబు తెలిపారు. గురువారం మండలంలోని వివిధ గ్రామాల్లో సిడిసిఎల్ ఆర్‌సి సురేష్ బాబు, మండల కన్వీనర్ భీమప్ప చౌదరి, ఎపిఒ శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ మొక్కలు నాటారు. మాతృభూమికి వందనం సమర్పించారు. దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో అమరులైన వీరులకు వందనం సమర్పించారు. అనంతరం పాఠశాలల చిన్నారులు, అధికారులు, సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE, ADONI
LA NO: 15/2023 IN O.S. No. 143/2013

Between:
Burujula Lakshmi Devi and others. ...petitioners
AND
B Pakkirappa and another. ...Respondents

NOTICE

To:
1. B. Padmavathamma,W/O Late B. Pakkirappa, Hindu, major. (R-3)
2. B.Kistamma, D/O Late B. Pakkirappa, Hindu, major, (R-5).
3. B. Shashikala, D/O Late B. Pakkirappa, Hindu, major. (R-6).
4. B. Vijayalakshmi, W/O Late B. Rajendra Prasad, Hindu, major. (R-7).
5. B. Shashidar, S/O Late B. Rajendra Prasad, Hindu, major, (R-8).
6. B. Vamshi, S/O Late B. Rajendra Prasad, Hindu, major (R-9).
7. B.Kranthi, D/O Late B. Rajendra Prasad, Hindu, major, (R-10).
8.Chandramma W/o Late B. Pakirappa, Hindu major (R-11).
9.B.Dhanalaxmi, D/O Late B. Rajendra Prasad, Hindu, major, (R-12).
10. B. Parvathi, D/O Late B. Rajendra Prasad, Hindu, major, (R-13).
11.B. Krishnaveni, W/O Late B. Vijay Kumar, Hindu, major, Resident (R-14).
12. B. Hari Krishna, S/O Late B. Vijay Kumar, Hindu, major (R-15).
13. B. Vandana, D/O Late B.Vijay Kumar, Hindu, major, (R-16).

All are resident of Resident of Molagavalli Village, Alur mandal, Kurnool District.

Whereas the above named petitioner has filed the above application in the suit against You no.1 to 13 The Hon'ble Court was pleased to permit the petitioner to serve the summons to you no.1 to 13 by way of paper publication. Therefore you no.1 to 13 are hereby directed to appear before this Hon'ble Court on 22/08/2023 at 10:30 AM either in person or through your Advocate and file your objections if any, failing which the matter will be decided in your absence.

L.K. Jeevan Singh, B.E., LL.B.
Advocate Plaintiff, Adoni.

వార్డు మెంబర్‌కు వైసిపిలో పోరు

- అధికార పార్టీ నుంచి రెండు గ్రూపులుగా 5 నామినేషన్లు దాఖలు
- టిడిపికి కరువైన అభ్యర్థి

ప్రజాశక్తి - నందికొట్కూరు

గ్రామాల్లో స్థానిక సంస్థల్లో ఖాళీగా ఉన్న ప్రజా ప్రతినిధుల ఎన్నికలకు ఎన్నికల సంఘం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో నందికొట్కూరు మండల పరిధిలోని నాగటూరు గ్రామంలో ఖాళీగా ఉన్న 8వ వార్డు ఎన్నిక అధికార పార్టీలో ఉత్కంఠ నెలకొంది. ఒకవైపు ఎమ్మెల్యే అనుచరులు, మరో వైపు సిద్ధార్థ రెడ్డి అనుచరులు హోరాహోరీగా నామినేషన్లు దాఖలు చేశారు. అయితే ప్రతిపక్ష టిడిపి తరపున మాత్రం నామినేషన్ దాఖలు కాలేదు. గతంలో గ్రామానికి చెందిన సగినెల ఉసేనయ్య వార్డ్ మెంబర్‌గా గెలిచి, ఎమ్మెల్యే ఆర్థర్ సహకారంతో సింగిల్ విండో ఛైర్మన్‌గా ఎంపికై వార్డ్ మెంబర్ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఎస్సీ రిజర్వుడు చేయబడిన వార్డు మెంబర్ స్థానం ఖాళీ ఏర్పడింది. ఈ నేపథ్యంలోని వైసిపి బలపరిచిన నాయకులు రెండు గ్రూపులుగా విడిపోయి ఎమ్మెల్యే ఆర్థర్ వైపు నుండి సగినెల రాజు, ఎస్ స్వాములు, నామినేషన్ వేయగా.. మరోవైపు శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి వర్గీయులు చెరుకు రత్నమ్మ నామినేషన్ దాఖలు చేశారు. ఒకే వార్డ్ మెంబర్ స్థానానికి ఒకే పార్టీకి చెందిన వ్యక్తులు రెండు గ్రూపులుగా విడిపోయి వేరువేరుగా నామినేషన్ వేశారు. అయితే ప్రతిపక్ష పార్టీ టిడిపి తరపున ఎవ్వరూ నామినేషన్ వేయకపోవడంతో అభ్యర్థి కూడా కరువయ్యారని ప్రజలు చర్చించుకుంటున్నారు. గ్రామంలో ఆ వార్డులో టిడిపికి ప్రజల ఆదరణ ఉన్నప్పటికీ వార్డ్ మెంబర్ స్థానంకు నామినేషన్ వేయించకపోవడం పట్ల ఆ పార్టీకి చెందిన గ్రామ నాయకులు, కార్యకర్తలు తీవ్ర అసంతృప్తికి గురైనట్లు సమాచారం. అయితే వైసిపి సానుభూతి పరుల నుండి 5 నామినేషన్లు దాఖలు కావడంతో ఏకగ్రీవం చేసుకోవాల్సిన అధికార పార్టీ గ్రూపుల పోరుతో పోటీలో సై..సై అంటూ నామినేషన్‌లు వేసుకున్నారని ఆ పార్టీ కార్యకర్తలు, విశ్లేషకులు చర్చించుకుంటున్నారు.

వార్డు మెంబర్‌కు ఎమ్మెల్యే ఆర్థర్, బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి తరపున పోటాపోటీగా నామినేషన్ వేస్తున్న అభ్యర్థులు

చేయబోయే శంకుస్థాపనలు కాదు.. నాలుగేళ్లలో చేసిన అభివృద్ధి చెప్పండి

- బివి.రాఘవులుపై ఆర్థిక మంత్రి బుగ్గన వ్యాఖ్యలను ఖండించిన సిపిఎం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

కర్నూలు జిల్లా నుండి ఆర్థిక మంత్రిగా ఉన్న బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి కర్నూలు అభివృద్ధికి నిధులు కేటాయించలేదని, జిల్లాను అభివృద్ధి చేయడం చేత కాకపోతే రాజీనామా చేసి తప్పు కోవాలని ఇటీవల కర్నూలు పర్యటనలో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు వాఖ్యానించిన విషయం విధితమే. దానికి ఉలిక్కిపడిన ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి రాబోయే నెలలో చేపట్టబోయే శంకుస్థాపనల గురించి సెలవిస్తున్నారన్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రోడ్లకు రూ.2,750 కోట్లు కేటాయించినట్లు చెపుతున్నారని, కల్వకుర్తి-నంద్యాల, నంద్యాల-జమ్మలమడుగు, చెన్నై - సూరత్ వంటి జాతీయ రహదారులకు కేంద్రం నిధులు కేటాయిస్తే అవి మీ గొప్పగా చెప్పుకోవడం మీకే సాధ్యమవుతుందని ప్రభాకర్‌రెడ్డి అన్నారు. 8న ఐఎబి సమావేశం అనంతరం ఆర్థిక మంత్రి బుగ్గన సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు పైన చేసిన కామెంట్స్‌ను ప్రభాకర్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రాష్ట్ర రహదారులు అన్ని మోకాటిలోతు గుంతలతో అస్తవ్యస్తంగా ఉన్న విషయం మీకు కనిపించడం లేదా అన్నారు. ఆదోని-హోళగుంద రోడ్డు, కర్నూలు-రేమట, కొత్తకోట రోడ్డు, కర్నూలు పడిదెంపాడు, పూడూరు రోడ్డు చూస్తే రోడ్ల నిర్మాణం, నిర్వహణలో మీ ప్రభుత్వం గొప్పదనం తెలుస్తుందన్నారు. కర్నూలులో న్యాయ విశ్వ విద్యాలయం గురించి మాట్లాడుతున్న మీరు ముందు కర్నూలులో హైకోర్టు ఎందుకు ఏర్పాటు చేయలేదో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. ఉట్టికి ఎక్కలేనమ్మ స్వర్గానికి ఎగబాకుతానని చెప్పినట్లుగా ఆర్థిక మంత్రి బుగ్గన వ్యవహారం ఉందని పేర్కొన్నారు. కర్నూలు విజయవాడ మధ్య ఉన్న ఒక్క రైలును కేంద్ర ప్రభుత్వం రద్దు చేస్తే అడగటం చేతగాని ఎంపిలు, ఎమ్మెల్యేలు, మంత్రులు ఉంటె నేమి లేకపోతే నేమన్నారు. కర్నూలు జిల్లా సాగునీటి ప్రాజెక్టు లైన వేదవతి రిజర్వాయర్ల నిర్మాణం, ఆర్‌డిఎస్ కుడికాలువ నిర్మాణం, హంద్రీనీవా నుండి 106 చెరువులకు నీళ్ల నింపే పనులు, హంద్రీనీవా పంట కాలువల నిర్మాణం ఈ 4 సంవత్సరాలలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదే దానికి మీరు ఏమి సమాధానం చెబుతారని ప్రభాకర్ రెడ్డి ప్రశ్నించారు. శ్రీశైలం ప్రాజెక్టులో 860 అడుగులకు పైనే నీళ్లు ఉన్నా తెలుగుగంగ, కెసి కెనాల్ ఆయకట్టుకు నీళ్లు విడుదల చేయించలేని మీరు ప్రాజెక్టుల నిర్మాణం గురించి గొప్పలు చెప్పడం మానుకోవాలని ఆయన హితవు పలికారు. విమర్శకు ప్రతి విమర్శ చేయడం మానుకొని అభివృద్ధి కొరకు నిధులు కేటాయించాలని, ప్రజల అభిమానం సంపాదించు కోవాలని ఆయన సూచించారు. లేదంటే గతంలో టిడిపికి పట్టిన గతే వైసిపి ప్రభుత్వానికి పడుతుందని. ఆ పరిస్థితి రాకుండా చూసుకోవాలని ఆర్థిక మంత్రికి సలహా ఇచ్చారు.

ఓటర్ల సర్వే వందశాతం పూర్తి చేయాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్రంలో ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా 2024లో భాగంగా ఇంటింటి సర్వే వంద శాతం పూర్తి కావాలని అధికారులను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. గురువారం అమరావతిలోని కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా పురోగతిపై ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లు, జెసిలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. నంద్యాల కలెక్టర్ ఛాంబర్ నుంచి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్, డిఆర్ఓ పుల్లయ్య, ఇఆర్ఓలు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మాట్లాడుతూ ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా కోసం చేపట్టిన ఇంటింటి సర్వే పురోగతిపై జిల్లాల వారీగా కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఫారం-6 కొత్త ఓటర్లకు, 18 సంవత్సరాల నిండిన వారికి ఇవ్వాలని, ఫారం-8 చిరునామా మార్పులకు ఇవ్వాలన్నారు. ఓటర్ల తొలగింపు సంబంధించి ప్రొసీజర్ ప్రకారం జాగ్రత్తగా చేయాలన్నారు. అలాగే పలు అంశాలపై ఈఆర్‌ఓలు, ఏఈఆర్ఓలకు దిశానిర్దేశం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం ప్రణాళికాబద్ధంగా పారదర్శక ఓటర్ల జాబితా ప్రక్రియ పూర్తి చేస్తున్నామని వివరించారు. ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా 2024ను ఎలాంటి పెండింగ్ లేకుండా ఇంటింటి సర్వేని వేగవంతం చేసి ఈనెల 21వ తేదీలోగా పూర్తి చేస్తామని తెలిపారు. జిల్లాలో ఫారం-6, 7, 8 పెండిన్సిలపై, గ్రీవెన్స్‌ల పరిష్కారాల గురించి వివరించారు. కొత్తగా ఓటు నమోదుకు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 18-19 వయస్సులో ఉన్న వారు, ట్రాన్స్‌జెండర్లు, నిరాశ్రయుల జాబితా తయారీలోనూ ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, డిఆర్ఓ

మట్టి మిద్దె కూలి వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి - నందికొట్కూరు

మండలంలోని అల్లూరు గ్రామంలో బుధవారం రాత్రి నుండి తెల్లవారుజాము వరకు కురిసిన వర్షానికి మట్టి మిద్దె కూలీ సావిత్రమ్మ (70) మృతి చెందింది. రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా పై కప్పు కూలి మీద పడడంతో ఆమె చనిపోయింది. స్థానికులు గమనించి ఆమెను కాపాడే ప్రయత్నం చేయగా, అప్పుడే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సంఘటన స్థలన్ని తహాశీల్దార్ రాజశేఖర్ బాబు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు రవీంద్ర నాయుడు, వీఆర్వో లు స్వామన్న, వెంకటేశ్వర్లు, సురేంద్ర నాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కూలిన మట్టి మిద్దె
మృతి చెందిన వృద్ధురాలు సావిత్రమ్మ (ఫైల్)

పొలాల రస్తా ఆక్రమణ

- గేటు పెట్టి తాళం వేసిన వైనం
- అధికారులు న్యాయం చేయాలంటున్న సమీప పొలాల బాధిత రైతులు

ప్రజాశక్తి - అవుకు

అవుకు మండలం చెర్లోపల్లి గ్రామానికి చెందిన నల్ల రాజు పొలాలకు వెళ్లే రహదారిని కబ్జా చేసి అడ్డంగా గేటు ఏర్పాటు చేసి తాళం వేసిన ఘటన గురువారం చోటు చేసుకుంది. బాధిత రైతులు తెలిపిన వివరాల మేరకు.. చెర్లోపల్లి గ్రామానికి చెందిన నల్ల రాజు ఐదు సంవత్సరాల క్రితం అదే గ్రామానికి చెందిన నాగమద్ది వద్ద ఆరెకరాల పొలం కొన్నాడు. కొన్న పొలం రోడ్డుకు ఇరువైపులా ఉంది. దీంతో నల్ల రాజు పొలానికి అటు ఇటుగా ఉన్న రోడ్డు కూడా నాదేనని దౌర్జన్యంగా గేటు ఏర్పాటు చేసి తాళం వేశాడు. అయితే ఈ రోడ్డు పురాతన కాలం నుంచి ఉంది. ఈ రోడ్డు వెంట సుమారు 100 ఎకరాల పొలం ఉంది. దాదాపు 40 మంది రైతులు పొలాలను సాగు చేసుకుంటున్నారు. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో విత్తనాలు వేసేందుకు వెళ్లగా రోడ్డుకు గేటు ఏర్పాటు చేసి తాళం వేయడంతో తమ పొలాలకు ఎలా వెళ్లాలో తెలియక అయోమయంలో పడ్డారు. విత్తనం వేయకపోవడంతో పొలాలు బీళ్లుగా మారుతున్నాయని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధిత రైతులు ఈ విషయంపై జిల్లా ఎస్‌పికి, జిల్లా కలెక్టర్‌కు స్పందన కార్యక్రమంలో న్యాయం చేయాలని అర్జీలు అందజేశారు. అర్జీలు పెట్టి నెల గడుస్తున్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధిత రైతులు వాపోతున్నారు. రహదారిపై గేటు అలాగే ఉందని, పూర్వీకుల కాలం నుంచి ఈ పొలాలకు రస్తా ఉందని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులు స్వయంగా పరిశీలించి తమకు న్యాయం చేయాలని గ్రామానికి చెందిన రైతులు మద్దిరాల శివయ్య, కాశమ్మ, కొండిగాళ్ళ నాగ మద్దయ్య, నాగన్న, షేక్షావలి, హుస్సేన్ సా, సుధాకర్, కృష్ణుడు, కర్ణయ్య తదితరులు కోరుతున్నారు.

పొలాలకు వెళ్లకుండా రస్తాకు గేటు ఏర్పాటు చేసి వేసిన తాళాన్ని చూపుతున్న బాధిత రైతులు

నులిపురుగుల నివారణకు 'ఆల్బెండజోల్'

- డిఎంహెచ్ఓ డాక్టర్ ఆర్.వెంకటరమణ - జిల్లా వ్యాప్తంగా జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం

ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న డిఎంహెచ్ఓ, ప్రోగ్రామ్ ఆఫీసర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

విద్యార్థులలో ఆరోగ్య సమస్యలు రాకుండా, నులిపురుగులు, రక్త హీనత నివారణకు ప్రతి ఒక్కరూ ప్రతి ఏటా తప్పనిసరిగా అల్బెండజోల్-400 ఎంజి మాత్ర ఒకటి వేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఆర్.వెంకటరమణ తెలిపారు. గురువారం ఆర్టీసీ బస్టాండ్ దగ్గర ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమం రెండవ విడత సందర్భంగా రాష్ట్రీయ బాల స్వార్థి కార్యక్రమం జిల్లా ఇంచార్జి కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.కాంతారావు నాయక్ పాఠశాల ఇంచార్జి హెచ్ ఎం ప్రసాద్ రావు ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుక్త వయస్సు బాలికలలో కనిపించే రక్తహీనతకు ప్రధాన కారణం నులి పురుగులేనని అన్నారు. నులి పురుగుల నిర్మూలనకు ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకొకసారి విద్యార్థులందరికి ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తుందని తెలిపారు. అంతకుముందు ఆయన విద్యార్థులకు మాత్రలు వేశారు. ఈ మాత్రలు చప్పరించి, నమిలి మింగిన తరువాత నీళ్ల తాగాలని సూచించారు. కార్యక్రమంలో **(మిగతా 6వ పేజీలో..)**

శ్రీశైలానికి నిలిచిన నీటి ప్రవాహం

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు : శ్రీశైలం జలాశయానికి ఎగువ ప్రాంతం నుండి పూర్తిగా నీటి ప్రవాహం నిలిచిపోయింది. ఎగువ జూరాల నుండి విద్యుత్ ఉత్పత్తి ద్వారా 30,589 క్యూసెక్కుల నీరు రాగా మూడు గంటల తర్వాత జూరాల నుండి విద్యుత్ ఉత్పాదన నిలిచి వేయడంతో నీటి ప్రవాహము నిలిచిపోయినది. అదే సమయానికి జలా శయ నీటిమట్టం 865.20 అడుగులకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 123.0193 టీఎంసీలుగా నమోదయింది. తెలంగాణ ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో అవసరం మేరకు 11,350 క్యూసెక్కుల నీటితో గడచిన 24 గంటలలో 5.746 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిని, మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 2, 400 క్యూసెక్కుల నీటిని శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి తెలంగాణకు విడుదల చేస్తున్నారు. కుడిగట్టు జల విద్యుత్తు కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశారు.

12న ఉచిత దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి - రుద్రవరం : వాసాపురం వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఈనెల 12న ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ సింగతల మధుసూదన్ రెడ్డి గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లా కేంద్రంలోని కేఎం రెడ్డి డెంటల్ కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో దంత వైద్య నిపుణులు డాక్టర్ కేయం రెడ్డి ఉచిత వైద్య శిబిరంతో పాటు అవగాహన సదస్సు నిర్వహించనునట్లు చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉమ్రా వెళ్లే ముస్లిములకు అవగాహన

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : ఈనెల 14న సోమవారం ఉమ్రా వెళ్లే ముస్లిములకు మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద చింతకుంట్లలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. పట్టణంలోని కొత్త మస్జీద్ ఇమామ్ నయిముల్లా అల్ - ఫయాజ్ ఉమ్రా టూర్స్, ట్రావెల్స్ ఆధ్వర్యంలో 68 మంది ముస్లిములు 15 రోజులు మక్కా, మదీన సందర్శనార్థం ఈనెల 14న బయలుదేరి వెళ్తున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్ రసూల్ హాజరై మాట్లాడారు. ప్రతి ముస్లిం జీవితంలో ఒక్కసారైనా మక్కా, మదీనాను సందర్శించాలని కోరుకుంటా రన్నారు. అలాంటి కలను మా ప్రాంత ముస్లిములకు అల్ ఫయాజ్ టూర్స్ ద్వారా సాకారం చేసిన యాజమాన్యానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. అనంతరం టూర్, ట్రావెల్స్ వారు అందించిన కిట్స్ సభ్యులకు అందించి వారిని పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు నాగిరెడ్డి, హాఫీజ్ కమల్, హాఫిజ్ సద్దాం, బాష, బ్యాంక్ హుస్సేన్ సా, జమాల్, అమీర్, ఎక్సైడ్ బ్యాటరీ జాకీర్, అన్వర్, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

ఉమ్రా వెళ్లే ముస్లిం సోదర సోదరీమణులను సన్మానిస్తున్న దృశ్యం

పోతిరెడ్డిపాడుకు నీటిని విడుదల చేయాలి : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

శ్రీశైలం ప్రాజెక్టు నుండి పోతిరెడ్డిపాడుకు నీటిని విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి, కుందు పరివాహక ప్రాంత రైతులు, ఎస్ఆర్‌బిసి రైతులతో కలిసి పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్‌ను సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరి కార్యక్రమంలో భాగంగా గురువారం సందర్శించారు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని సెల్ఫీ ఛాలెంజ్ ద్వారా ప్రభుత్వాన్ని మాజీ ఎమ్మెల్యే నిలదీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశైలం ప్రాజెక్టులో 864 అడుగుల నీరు ఉన్నా పోతిరెడ్డిపాడుకు నీటిని విడుదల చేయడం లేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం కరెంట్ ఉత్పత్తి పేరుతో నీటిని తరలిస్తున్నా వైసీపీ ప్రభుత్వం, మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు నోరు మెదపడం లేదన్నారు. ఎస్ఆర్‌బిసి, కుందు పరివాహక ప్రాంత రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతున్న ఈ ప్రాంత ఎంపీ, ఎమ్మెల్యేలు పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఐఎబి సమావేశంలో నీటి విడుదలపై మాట్లాడకపోవడం దారుణమన్నారు. ప్రజాప్రతినిధులు బాధ్యత లేకుండా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అలగనూరు, పోతిరెడ్డిపాడు, గోరుకల్లు రిజర్వాయర్లను నింపాలని డిమాండ్ చేశారు. ఎస్ఆర్‌బిసి, కుందుకు నీటిని విడుదల చేయకపోతే ఈ ప్రాంత రైతులతో కలిసి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపి ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు కృష్ణా నాయక్, నాయకులు లింగాల నాయుడు, కుందు పరివాహక ప్రాంత రైతులు పాల్గొన్నారు.

పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్‌ను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే

ఉద్యోగాల పేరుతో మోసం చేసిన ముగ్గురు అరెస్ట్

- రూ. 35 లక్షలు స్వాధీనం : ఎస్‌పి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగులను మోసం చేసిన ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి తెలిపారు. గురువారం నంద్యాలలోని ఎస్పీ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ జి.వెంకట రాముడు, ఆత్మకూరు డిఎస్పీ శ్రీనివాస రావుతో కలిసి జిల్లా ఎస్పీ విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. నిరుద్యోగ యువతే లక్ష్యంగా వీరు మోసాలు చేస్తున్నారని తెలిపారు. 2001లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి నందికొట్కూరుకు చెందిన ఉమాదేవి, మరో నలుగురు వ్యక్తుల నుండి నటరాజ సూర్యదేవర అనిల్ కుమార్, వీర చైతన్య, సనా ఉల్ల, పాలెం అశోక్ కుమార్ రెడ్డిలు బాధితుల నుండి రూ. 49 లక్షల 24 వేలు తీసుకొని మోసం చేశారన్నారు. ఉమాదేవి పోలీస్ స్పందనలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టగా పలు అంశాలు బయట పడ్డాయన్నారు. బాధితులకు నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్‌లు ఇచ్చి మోసం చేశారని, వీరిపై సైఫాబాదు, విజయవాడ, పాలకొల్లు, హైదరాబాదు, హుమాయూన్ నగర్ ప్రాంతాలలో కేసులు నమోదైనట్లు వెల్లడించారు. నిరుద్యోగ యువత లక్ష్యంగా వీరు కొంతమంది ఏజెంట్లను నియమించుకొని జాయినింగ్ లెటర్లు, శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తూ మోసం చేశారన్నారు. ఈ కేసు విచారణలో నందికొట్కూర్ టౌన్ సిఐ విజయ భాస్కర్, ఎస్ఐ వెంకట రమణ, సిబ్బంది సహాయంతో గురువారం మధ్యాహ్నం 12 గంటలకు ముద్దాయిలు నటరాజ శేఖర్, సూర్యదేవరా, పాలెం అశోక్ కుమార్ రెడ్డిలను కర్నూలు కొత్త బస్టాండ్ వద్ద అరెస్టు చేసి, వారి వద్ద నుండి రూ. 35 లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని, వారి కోసం పోలీసులు గాలిస్తున్నట్లు చెప్పారు. ఈ కేసును ఛేధించడంలో పాల్గొన్న నందికొట్కూర్ సిఐ, ఎస్ఐ, సిబ్బందిని అభినందించి రివార్డులు అందజేశారు.

స్వాధీనం చేసుకున్న నగదును చూపుతున్న ఎస్‌పి

రాష్ట్ర భవిష్యత్ బాబుతోనే : బిసి ఇందిర

ప్రజాశక్తి - కోవెలకుంట్ల

గత టిడిపి ప్రభుత్వంలో కులమతాలకతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు గతంలో అందించారని, రాష్ట్ర భవిష్యత్తు బాబుతోనే సాధ్యమని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి సతీమణి బిసి ఇందిరా పేర్కొన్నారు. మండలంలోని పెద్దకొప్పెర్ల గ్రామంలో ఆమె పర్యటించారు. చంద్రబాబు నాయుడు మహాశక్తి పేరుతో ప్రవేశపెట్టిన పథకాలను ఆమె మహిళలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిడిపి మేనిఫెస్టోలో మహిళలకు ఉచిత బస్సు, సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఆడబిడ్డ నిధి కింద ప్రతి 18 సంవత్సరాలు దాటిన వారికి రూ.18 వేలు, ప్రతి ఇంటికి ఉచితంగా నీటి కొళాయి, తల్లికి వందనం కింద ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15 వేలు చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపారు. అన్నదాత పేరుతో ప్రతి రైతుకు రెండు రూ. 20 వేలు, నిరుద్యోగ యువతకు యువగళం నిధి పేరుతో రూ. 36 వేలు ప్రతి సంవత్సరం ఇస్తామన్నారు. కార్యక్రమంలో పెద్దకొప్పెర్ల వెంకటేశ్వర్ రెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం నాగేశ్వర్ రెడ్డి గడ్డం అమర్నాథరెడ్డి, బిజినవేముల హుస్సేనయ్యా, అమడాల మద్దిలేటి, వల్లంపాడ జగదీశ్వర్‌రెడ్డి ,శ్రీనివాసరెడ్డి, పెనుగొండ రాజశేఖర్, కులాయి భాష, కలగొట్ల గడ్డం నాగార్జున రెడ్డి, అభిరుచి బాల మద్దిలేటి పాల్గొన్నారు.

బిసి ఇందిరాకు స్వాగతం పలుకుతున్న ప్రజలు

మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సుజాత

సెప్టెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : పట్టణంలోని కోర్టు ఆవరణంలో సెప్టెంబర్ 9 న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆళ్లగడ్డ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సుజాత తెలిపారు. గురువారం స్థానిక కోర్టు ఆవరణంలో మండల న్యాయ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ బార్ అసోసియేషన్ న్యాయవాదులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ కోర్టులలో పెండింగ్‌లో ఉన్న రాజీ అయ్యే సివిల్, క్రిమినల్ తగాదాలోని కక్షిదారులలో ఇరువురికి లోక్ అదాలత్ గురించి తెలియజేసి సెప్టెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకునేలా న్యాయవాదులు అందరూ సహకరించి విజయవంతం చేయాలన్నారు. లోక్ అదాలత్‌ల ద్వారా అప్పీలు లేని తీర్పును పొందవచ్చన్నారు. సమావేశంలో ఆళ్లగడ్డ బార్ అసోసియేషన్ సీనియర్, జూనియర్ న్యాయవాదులు, ఏపిపిలు సోమశేఖర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డిలు పాల్గొన్నారు.

నూతన డిగ్రీ కళాశాల భవనం నిర్మించాలి

- ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు డిమాండ్

ప్రజాశక్తి - పాణ్యం : పాణ్యం నియోజకవర్గంలో నూతన డిగ్రీ కళాశాల బిల్డింగ్‌ను తక్షణమే నిర్మించాలని ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు ఆధ్వర్యంలో పాణ్యం తహశీల్దార్ మల్లికార్జున్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ప్రతాప్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు రఫీ, జిల్లా నాయకులు బాలాజీ, సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలో మౌనిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జూనియర్ కళాశాల విద్యార్థులందరికి ఉచితంగా పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రవి నాయక్, హరి, వినయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

వినతి ఇస్తున్న నాయకులు

పట్టుబడిన లారీతో విజిలెన్స్ అధికారులు

300 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని మద్దూరు మెట్ట సమీపంలో 40వ జాతీయ రహదారిపై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ సీఐ నాగరాజుయాదవ్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి అక్రమంగా తరలుతున్న దాదాపు 300 బస్తాల రేషన్ బియ్యంతో ఉన్న లారీని గురువారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు నంద్యాల జిల్లా వెలుగోడు నుంచి కర్ణాటక రాష్ట్రంలోని బంగారుపేటకు ఏపీ 27 ఎక్స్ 1702 నంబరు గల లారీలో దాదాపు 300 బస్తాలను తరలిస్తుండగా సమాచారం అందుకున్న విజిలెన్స్ సీఐ నాగారాజు యాదవ్, సిబ్బంది మండలంలోని మద్దూరు మెట్ట సమీపంలో దాడులు నిర్వహించి లారీని స్వాధీనం చేసుకున్నారు. లారీ డ్రైవరు సికింధ్రతో పాటు దళారి వెంకటేశ్వర రెడ్డిని అదుపులోకి తీసుకుని, లారీని స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు. అక్రమ రవాణాకు కారణ మైన నిందితుడు ఖలీల్ కోసం గాలిస్తున్నట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయి డిటి సోమశేఖర్ రెడ్డి,విజిలెన్స్ సిబ్బంది సిద్ధయ్య, జమాల్,ప్రవీణ్,సుబ్బరాయుడు పాల్గొన్నారు.

పాతాళగంగ కళ్యాణకట్ట వసతి సముదాలను పరిశీలించిన ఇఒ లవన్న

నీటిమట్టాన్ని అనుక్షణం పరిశీలిస్తూ ఉండాలి : ఇఒ

ప్రజాశక్తి - శ్రీశైలం

నీటిమట్టాన్ని అనుక్షణం పరిశీలిస్తూ ఉండాలని ఇఒ లవన్న అధికారులను ఆదేశించారు. శ్రావణమాసంలో భక్తుల సౌకర్యార్థం పని ఏర్పాట్లపై రోజు పరిశీలనలో భాగంగా గురువారం నాడు దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్న తమ సిబ్బందితో కలిసి కళ్యాణకట్ట, పాతాళ గంగ, వసతి సముదాయాలను పరిశీలించారు. పాతాళ గంగలో పెరుగుతున్న నీటిమట్టం అనుగుణంగా ఏర్పాట్లను చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. బారికేడ్లను ఏర్పాటు చేయాలని, పాతాళ గంగలో, మెట్ల మార్గంలో విద్యుత్ దీపాలను ఏర్పాటు, తదితర పనులపై సూచనలు చేశారు.

నేడు డయల్ యువర్ డిఎం

ప్రజాశక్తి-డోన్

ఆర్టీసీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించే డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డోన్ డిపో మేనేజర్ ఎం శశిభూషణ్ పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు ప్రజలు తమ సమస్యలను సలహాలు సూచనలను 9959225795 నెంబర్ కు కాల్ చేసి తమ సమస్యలను తెలపాలని కోరారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

చికెన్ షాప్‌ను ప్రారంభిస్తున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

గెలాక్సీ ఫ్రెష్ చికెన్ షాప్‌ను ప్రారంభించిన శాప్ చైర్మన్

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరు పట్టణంలోని అమ్మ హెూటల్ ఎదురుగా నూతన గెలాక్సీ చికెన్ సెంటర్‌ను శాప్ చైర్మన్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి గురువారం ప్రారంభించారు. 'గెలాక్సీ పౌల్ట్రీ ఫార్మ్' సంస్థలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వ్యవస్థాపకులు శివప్రసాద్ రెడ్డిని శాప్ చైర్మన్ ఆదేశించారు. అనంతరం గెలాక్సీ పౌల్ట్రీ ఫార్మ్స్ వ్యవస్థాపకులు బి.శివ ప్రసాద్ రెడ్డి, నిర్వాహకులు కళ్యాణ్ రెడ్డి, చరణ్ రెడ్డి మాట్లాడుతూ పట్టణ ప్రజలకు నాన్యమైన చికెన్‌ను సరసమైన ధరలకు అందించడమే తమ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమ ంలో అన్నపూర్ణ హెూటల్స్ అధినేత గాంతి సంజీవరెడ్డి, రఘునాథరెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి,గురునాథ రెడ్డి,హనుదీప్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు అబ్దుల్ రవూఫ్, నాయబ్,చిన్న రాజు,లాలు ప్రసాద్, అల్లూరి కిరాణం మర్చంట్ అధ్యక్షుడు మన్సూర్,ప్రభుత్వ ఖాజీ మౌలాన సయ్యద్ జలాల్, మాజీ జెడ్పిటిసి పుల్యాల నాగిరెడ్డి, సర్పంచ్ కేశవరెడ్డి నాగార్జున రెడ్డి, జూపాడు బంగ్లా వైస్ ఎంపీపీ తోకల కృష్ణారెడ్డి,వార్డు ఇంచార్జ్ లు ఉస్మాన్ బేగ్, మందడి రవీంద్రారెడ్డి, బొల్లెద్దుల రామకష్ణ,సన అబ్దుల్లా, పి.రమేష్,శాలి బాష,బ్రహ్మయ్య. తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీగా నామినేషన్లు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ మండలం కోటకందుకూరు గ్రామ పంచాయతీ ఎన్నికకు గురువారం చివరి రోజు కావడంతో 14 మంది నామినేషన్లు దాఖలు చేశారు. దుర్వేసుల సులోచన, ఆర్ల నాగ శ్రీనివాసులు, నాగమ్మ, నర్సిపల్లి ఇస్మాయిల్‌తోపాటు మరో పది మంది నామినేషన్లు దాఖలు చేశారని ఎన్నికల అధికారి రామకృష్ణ నాయక్ తెలిపారు. సిరివెళ్ల మండలంలోని గుంప్రమానుదిన్నె 12వ వార్డుకు ఒకే నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవమైంది.. టిడిపికి చెందిన వట్టికూటి భారతి ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. దీంతో గుంప్రమానుదిన్నె టిడిపి నాయకులు కుందూరు మోహన్ రెడ్డి మరోసారి తన పట్టును నిలుపుకున్నారు. ఎర్రగుంట్ల గ్రామపంచాయతీకి సంబంధించి ఎనిమిదో వార్డుకు ఐదు నామినేషన్లు, వనికిందిన్నె గ్రామం ఐదో వార్డుకు రెండు నామినేషన్లు దాఖలు అయ్యాయి. **బేతంచెర్ల :** బేతంచర్ల మండల పరిధిలోని రహిమాన్ పురం, పెండేకల్ గ్రామపంచాయతీలలో ఖాళీగా ఉన్న వార్డులకు టిడిపి అభ్యర్థులు నామి నేషన్లు గురువారం దాఖలు చేశారు. రహిమాన్‌పురం గ్రామపంచాయతీలో ఖాళీ ఏర్పడ్డ 6వ వార్డుకు టిడిపి తరపున బి. పూల మద్దిలేటి, రిటర్నింగ్ అధికారి కిరణ్‌కి నామినేషన్ పత్రాలు అందజేయగా, ఎం పెండేకల్ గ్రామపంచాయతీ 10వ వార్డుకు టిడిపి తరపున శివకుమార్ రెడ్డి, బాలకృష్ణ, రిటర్నింగ్ అధికారి ఎస్వీ రంగ నాయక్‌కి నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ లీగల్ అడ్వైజర్ మధుసూదన్ గౌడ్, టిడిపి రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి, రవీంద్ర నాయక్, మండల ప్రధాన కార్యదర్శి రాజగోపాల్ రెడ్డి, పెండేకల్ మాజీ సర్పంచ్ పెద్ద వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర గౌడ్, మాధవ్, రవి, రామాంజనేయులు, ఎల్ల స్వామి, తదితరులు పాల్గొన్నారు. **పాములపాడు :** పాములపాడు గ్రామంలో 4వ వార్డ్ మెంబర్‌కు గ్రామ సచివాలయం నందు వంగాల రమాదేవి నామినేషన్ వేసినట్లు ఎన్నికల రిట ర్నింగ్ అధికారి జుబేర్ తెలిపారు. గురువారం చివరి రోజు కావడంతో నామినేషన్లు ఒక్కరే వేసినందున ఏకగ్రీవం అయ్యే పరిస్థితి ఉంది. **పగిడ్యాల:** మండల ంలోని పగిడ్యాల గ్రామపంచాయతీ పరిధిలో 9వ వార్డుకు ఉప ఎన్నికలకు నలుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్న్ అధికారి సుభాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ ఓ ఆర్ డి నాగేంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి , మాజీ జెడ్పిటిసి పుల్లల నాగిరెడ్డి, సర్పంచ్ పెరుమాళ్ళ శేషన్న పాల్గొన్నారు.

పాములపాడు : నామినేషన్ వేస్తున్న అభ్యర్థులు

బేతంచెర్ల : నామినేషన్ వేస్తున్న నేతలు

పగిడ్యాల: నామినేషన్ వేస్తున్న అభ్యర్థులు

సమన్వయంతో పని చేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గడివేముల

మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అభివృద్ధికి కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. గురువారం నాడు మండల సర్వసభ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సాదా సీదాగా జరిగింది. ముందుగా వివిధ శాఖల పనితీరుపై సమావేశంలో చర్చించారు. బిలకల గూడూరు గ్రామంలో ఉర్దూ టీచర్లు తక్కువగా ఉన్నారని సొసైటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. స్పందించిన మండల విద్యాశాఖ అధికారి డిప్యూటీషన్ మీద మరొక ఉపాధ్యాయులను నియమిస్తానని హామీ ఇచ్చారు. కొర్రపోలురు గ్రామంలో దాదాపు 30 విద్యుత్తు స్తంభాలు కూలడానికి సిద్ధంగా ఉన్నాయని వాటి స్థానంలో కొత్త స్థంబాలు ఏర్పాటు చేయాలని సర్పంచ్ మూలింటి మాలిక్ బాష పేర్కొనగా స్పందించిన ఎమ్మెల్యేకొత్త విద్యుత్ స్తంభాలను మార్చాలని ఆదేశించారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ 5 ఎకరాల భూమి కంటే తక్కువ ఉన్న వారి నిరుపేదలను గుర్తించి అసైన్మెంట్ కమిటీ కింద నిరుపేదలకు, సాగులో ఉన్నవారికి పట్టాలు ఇవ్వాలని తాసిల్దార్‌ను ఆదేశించారు. గడివేములలో ఎస్సార్ బీసీలో ఇళ్లస్థలాల కొరకు పనులు పూర్తయ్యాయని 420 మంది పట్టాదారులకు ఈనెల 16వ తేదీన పట్టాలు పంపిణీ చేస్తామని అన్నారు. మైనింగ్ గ్రాంట్ కింద గడివేముల మండలంలో దాదాపు మూడు కోట్ల రూపాయలు శాంక్షన్ అయ్యాయని వాటిని అభివృద్ధికి ఉపయోగించాలన్నారు. ఈ కార్యక్రమం లో జడ్పిటిసి ఆర్బి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ నాగ మద్దమ్మ, ఎంపీడీవో శివ మల్లేశ్వరప్ప, తహసిల్దార్ శ్రీనివాసులు, గడివేముల వైస్ సర్పంచ్ బాలచెన్ని, దేశం నాగేశ్వరరావు రెడ్డి, గడివేముల ఎంపీటీసీ వంగాల మహేశ్వర్ రెడ్డి, వైసీపీ నాయకులు పెసర వాయి శ్రీకాంత్ రెడ్డి, ఎల్లారెడ్డి, బూజునూరు రఘు మాధవరెడ్డి, మంచాలకట్ట అనిల్ కుమార్ రెడ్డి, కరిమద్దెల పుల్లయ్య, చిందుకూరు వెంకట కృష్ణారెడ్డి, శిరుపా శ్రీనివాస్ రెడ్డి, సొసైటీ చైర్మన్ బిలకల గూడూరు చంద్రశేఖర్ రెడ్డి, ఆర్లగడ్డ రమణారెడ్డి, వైస్ ఎంపీపీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దేశ వీరులను స్మరించుకోవాలి

పగిడ్యాల: ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - మహానంది

దేశ సంక్షేమం కోసం ప్రాణ త్యాగాలు చేసిన మహనీయులను, వీరులను స్మరించుకోవాలని అసోసియేట్ డీన్ డాక్టర్ కెఎస్ఎస్.నాయక్ అన్నారు. గురువారం వ్యవసాయ కళాశాలలో నా భూమి నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బుడ్డా రెడ్డి యశస్విని మాట్లాడుతూ దేశం కోసం పోరాడిన స్వాతంత్ర సమర యోధులు గుర్తుచేసుకోవడం మన కర్తవ్యమన్నారు. జెడ్పిటిసి కేవిఆర్ మహేశ్వర్ రెడ్డి, సర్పంచి కందుల వరలక్ష్మమ్మ, వైస్ ఎంపీపీ కుంచపు లక్ష్మి నరసమ్మ, ఎంపీడీవో శివ నాగ జ్యోతి, ఎంఈఓ రామ సుబ్బయ్య, ఏపీవో మనోహర్, ఈసీ రామేశ్వర్ రెడ్డి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పగిడ్యాల: మండలంలోని సంకిరేణి పల్లె గ్రామంలో గురువారం నా భూమి నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకటరమణ మాట్లాడారు. ఆజాదికా అమృత్ మహోత్సవాల్లో భాగంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించి మా భూమి నా దేశం కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. సచివాలయం ఆవరణలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద మొక్కలు నాటామన్నారు. అమరవీరులకు వందనాలు తెలుపుతూ ప్రతిజ్ఞ చేయడం జరిగిందన్నారు. అనంతరం జాతీయ జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో ఇఆర్‌డి నాగేంద్రయ్య, పి ఆర్ ఏ ఈ వెంకటేశ్వర్లు, ఏ పీ ఓ మద్దిలేటి, సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు, అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నందికొట్కూరు : మండల పరిధిలోని బొల్లవరం గ్రామంలో నా మట్టి నా దేశం ఏపీవో అలివేలమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ శోభారాణి మాట్లాడుతూ దేశం కోసం జీవితాన్ని అంకితం చేసిన సైనికులపేరుతో శిలాఫలకాల ఏర్పాటు, తదితర కార్యక్రమాలు నిర్వహించా లన్నారు. జూపాడుబంగ్లా మండలం పారుమంచాల గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ పెద్దయ్య ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ మాధవరం ప్రకాశం. ఎంపీపీ సువర్ణమ్మ, సి ఓ అహ్మద్, ఏపీఓ హాజరై స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. టి రసూల్, ఎం రాజు, సర్పంచులు, మాధవరం సుశీలమ్మ, మాధవరం రత్నం, వీరం జయ లక్ష్మమ్మ, రాఘవరెడ్డి, ఈసీ షబానా,టి ఏ కవిత, ప్రధానోపాధ్యాయులు, పిఈటి మాస్టర్, తదితరులు పాల్గొన్నారు.

బండి ఆత్మకూర్ : పార్నపల్లె గ్రామంలో సర్పంచ్ షేక్ షబ్బీర్ అహమ్మద్ ఆధ్వర్యంలో నా భూమి నా దేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు జై రెడ్డి చిన్న సంజీవరెడ్డి హాజరై మాట్లాడారు. ఏపీవో వసుధ, సచివాలయ సిబ్బందితో జాతీయ జెండాను ఎగురవేశారు.

ఎర్రగుంట్ల గ్రామంలో నా భూమి నా దేశం నా జాతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రగుంట్ల సర్పంచ్ కాలూరి శ్వేత కుమారి, వైసిపి నాయకులు కాలూరి ప్రసాద్, ఏపీవో వసుధ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను వివరించారు.

బండి ఆత్మకూర్ : జెండా వందనం చేస్తున్న దృశ్యం

ఘనంగా యుటిఎఫ్ ఆవిర్భావ వేడుకలు

ప్రజాశక్తి-డోన్

డోన్ పట్టణంలోని పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఘనంగా ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పూర్వ గౌరవాధ్యక్షులు నరసింహులు,రాష్ట్ర ఆడిట్ సభ్యులు ఎం.వెంకట సుబ్బారెడ్డి,మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌లు యూటిఎఫ్ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు ఉపాధ్యాయులు ఎన్నో రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారని, ప్రభుత్వం రకరకాల యాప్‌లను ప్రవేశపెట్టి, చదువు చెప్పే సమయం కూడా లేకుండా చేస్తున్నారని వాపోయారు. ప్రమోషన్ ఇచ్చి,బదిలీలు చేసి రెండు నెలలైన,కాడర్ స్ట్రెంత్ లేదని, ఇంతవరకు జీతాలు ఇవ్వక పోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో మండల గౌరవాధ్యక్షులు లక్ష్మయ్య సీనియర్ నాయకులు, బివై.సుబ్బారాయుడు,లక్ష్మీ కాంత రెడ్డి,రవిశేఖర్, జి.సుబ్బారాయుడు,జయ సుబ్బారాయుడు, మాణిక్యంశెట్టి తదితరులు పాల్గొన్నారు. **ప్యాపిలి :** ఉద్యోగ,ఉపాధ్యాయ, కార్మిక,పెన్షనర్ల సమస్యల పట్ల యుటిఎఫ్ రాజీ లేని పోరాటం చేస్తుందని జిల్లా సీనియర్ నాయకులు అబ్దుల్ లతీఫ్,మండల ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి పేర్కొన్నారు. అనంతరం సీనియర్ నాయకులు అబ్దుల్ లతీఫ్,అంజనప్ప యుటిఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో విశ్వనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎం.వెంకట సుబ్బారెడ్డి

ప్యాపిలిలో మాట్లాడుతున్న నాయకులు

నిరంకుశ పాలనకు స్వస్తి పలకండి : టిడిపి

ప్రజాశక్తి - బేతంచెర్ల

రాష్ట్రంలో నిరంకుశ పరిపాలన చేస్తున్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి ఓటుతో స్వస్తి పలకాలని తెలుగుదేశం పార్టీ డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి, బీసీ నియోజకవర్గం అధ్యక్షులు ఎర్రమల నాయుడు అన్నారు. గురువారం నాడు బేతంచెర్ల నగర పంచాయతీలోని బయటిపేట ఒకటో వార్డులో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం బేతంచెర్ల పట్టణ కార్యదర్శి షేక్షావల్లి చౌదరి, అంజాద్ బాష ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ప్రజలతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా నిత్యవసర సరుకుల ధరలు సామాన్యులకు అందనంత దూరంలో ఉన్నాయన్నారు. కౌన్సిలర్ రాంగోపాల్ ఎస్సీ సెల్ నంద్యాల పార్లమెంటు ప్రజాప్రతిని రూబెన్, చంద్రశేఖర్ చౌదరి, సుధాకర్ చౌదరి, రవీంద్ర నాయక్, శ్రీనివాస గౌడ్, రామాంజనేయులు, రామ్మూర్తి తిమ్మరాజు, గూటం శివ, నాగరాజు, మద్దిలేటి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలను పంపిణీచేస్తున్న ధర్మవరం సుబ్బారెడ్డి

పథకాల బుక్‌లెట్‌ను ఇస్తున్న ఎమ్మెల్యే

ప్రజా సంక్షేమం కోసమే గడపగడపకు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గడివేముల

ప్రజా సంక్షేమం కోసమే గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నారని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. గురువారంనాడు గడివేములలోని ఒకటో వార్డు నందు జడ్పిటిసి ఆర్ బి చంద్రశేఖర్ రెడ్డి. ఒకటో వార్డ్ మెంబర్ రసూల్ ఆధ్వర్యంలో గడప గడప కు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలను వివరించారు. అర్హులై ఉండి ఇంకెవరికైనా పథకాలు రాకుంటే వారి సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఆర్ బి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ నాగ మద్దమ్మ, తాసిల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో శివ మల్లేశ్వరప్ప,ఉప సర్పంచ్ బాల చిన్ని, ఎంపిటిసి మహేష్ రెడ్డి, వైసిపి నాయకులు నాగేశ్వర్ రెడ్డి. తదితరులు పాల్గొన్నారు.

అలగనూరు కట్టను ప్రభుత్వం ఆగం చేసింది

- గౌరు దంపతులు

ప్రజాశక్తి - గడివేముల

అలగనూరు రిజర్వాయర్ కట్టాను పరిశీలిస్తున్న గౌరు దంపతులు

నాలుగేళ్ల వైసిపి పాలనలో కుంగిన అలగనూరు రిజర్వార్ కట్టను నిర్మించకుండా ఆగం చేశారని గౌరుదంపతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసం పై యుద్ధభేరి కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీ జాతీ య అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆదే శాల మేరకు గురువారం నాడు టిడిపి పాణ్యం ఇంచార్జి మాజీ ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, నందికొ ట్కూరు నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ గౌరు వెంకటరెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి అలగనూరు ప్రాజెక్టును గురువారం సందర్శిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2017లో చిన్న గండితో మొదలైన పతనం మరమ్మతులకు నోచుకోక మూడు కోట్లతో మరమ్మతు చేయడం వదిలేసి, ఎక్సెస్ టెండర్ల ద్వారా రూ. 26 కోట్లకు మరమ్మతులకు ప్రభుత్వం టెండర్ పిలిచిందంటే ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసినట్టు కాదా అని ప్రశ్నించారు. వెంటనే ప్రభుత్వం అలగనూరు రిజర్వాయర్‌కు మరమ్మ తులు చేసి రైతులకు సాగునీటి కడపకు తాగునీరు అందేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో మండల టిడిపి నాయకులు దేశం సత్యనా రాయణ రెడ్డి, మంచాలకట్ట మురళీమోహన్ రెడ్డి, కరిమద్దుల ఈశ్వర్ రెడ్డి, బూజునూ రు రామచ ంద్రారెడ్డి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ సుభద్ర మ్మ, తెలుగు మహిళా ఆర్గనైజింగ్ సెక్రటరీ వడ్డు లక్ష్మీదేవి, సీతారాం రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని చేధించిన ఎపిజిబి ఉన్నతాధికారులు

బ్యాంక్ మేనేజర్ ను అభినందిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - మహానంది

2023-24 సంవత్సరానికి నిర్దేశించిన రూ.30.39 కోట్లు డిపాజిట్లు లక్ష్యం చేరుకున్నట్లు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ఎస్.సుధీంద్ర కుమారి తెలిపారు. గురువారం ఈ సందర్భంగా ఆమె సిబ్బందిని అభినందిస్తూ మిఠాయిలు పంచి పెట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బ్యాంకు నుంచి ప్రజల, రైతుల ఆర్థిక పురోగతిని మరింత పెంచేందు కోసం రూ.34.69 కోట్ల లక్ష్యం ఉండగా ఇప్పటికీ రూ.35.02 కోట్లకు చేరుకున్నట్లు తెలిపారు. ఎక్కడా లేని విధంగా తమ ఎపిజిబిలో డిపాజిట్లపైన 6.85 వడ్డీని ఇస్తున్నట్లు చెప్పారు. అలాగే సిరి -400, సిరి-600 పథకాల్లో భాగంగా కూడా 7.2, 7.25 శాతం ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ గౌరీ, ఫీల్డ్ ఆఫీసర్ ధరణి, క్యాషియర్ శ్రీకాంత్, బ్యాంకు సహాయకులు డి. చంద్రమౌళీశ్వరుడు, డి.పెద్ద శివుడు పాల్గొన్నారు.

రక్తనాళాల శస్త్రచికిత్సకు వ్యాధిగ్రస్తుల తరలింపు

- స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా

ప్రజాశక్తి - ఆత్మకూరు

రోగులు ప్రత్యేక బస్సులో తరలి వెళుతున్న దృశ్యం

రక్తనాళాల శస్త్ర చికిత్స కోసం ఆత్మకూరు నుండి హైద్రాబాద్ ఏషి యన్ వాస్కులర్ ప్రముఖ వైద్యశాలకు 100 మంది రోగులను పంపినట్లు ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా తెలిపారు. ముఖ్యఅతిథిగా ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు రేడియం నూర్, ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ కోశాధికారి నాగుర్ ఖాన్ గురువారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్నా మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితం స్పోర్ట్స్ క్లబ్ ఆవరణంలో 1000 మందికి ఉచిత రక్త నాళాల పరీక్షలు నిర్వహించారని అందులో వంద మందిని శస్త్ర చికిత్స అవసరమైన వారీగా గుర్తించా రన్నారు. గురువారం రోగుల అంగీకారం హైద్రాబాద్‌కు పంపినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి సొంత నిధులతో రెండు బస్సులను ఏర్పాటు చేశారని, బుడ్డా రాజశేఖర్ రెడ్డి, హైద్రాబాద్ ఏషియన్ వాస్కులర్ వైద్యశాల అధినేత ప్రవీణ్ కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. అబ్దుల్ కలాం, అబ్దుల్ హుస్సేన్, సురేంద్ర బాబు, హాస్పిటల్ ఇంఛార్జి నవీన్ పాల్గొన్నారు.

కేసి కెనాల్‌కు నీటిని విడుదల చేయాలి : రైతు సంఘం

ప్రజాశక్తి - పాములపాడు

కేసీ కెనాల్‌కు ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుండి నీటిని విడుదల చేయాలని రైతు సంఘం మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ వర్షాలు లేక మొక్కజొన్న, తదితర ఆరుతడి పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందని, కెనాలుకు అధికారులు ఎత్తిపోతల పథకం నుండి నీటిని విడుదల చేయాలని కోరారు.

ఈ క్రాప్ నమోదు తప్పని సరి : ఎఒ

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

రైతులు తమ పంటల వివరాలు తప్పని సరిగా ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని మండలవ్యవసాయఅధికారి పేర్కొన్నారు. గురువారం నంద్యాల మండలం చాపిరేవుల గ్రామంలో విఎఎ, ఎఇఒలతో కలిసి పంట నమోదు ప్రక్రియను క్షేత్ర స్థాయిలో ఆయన పరిశీలించారు. **బనగానపల్లె :** ఈ క్రాప్ బుకింగ్ నమోదును ప్రారంభించాలని మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయంలో మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఉద్యానవన శాఖ, గుణాంకాల శాఖ గ్రామస్థాయి వ్యవసాయ సహాయకులకు, గ్రామ రెవెన్యూ అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డివైఎస్ఓ చిదంబరం, ఉద్యాన వనాధికారి రఘువరన్, గుణాంక అధికారి వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

బండి ఆత్మకూర్: పంటల వివరాలను రైతులు ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి స్వాతి తెలిపారు. బండాపూర్ మండల కేంద్రానికి చెందిన మండల కో ఆప్షన్ సభ్యులు జమాల్ పొలంలో ఈ క్రాఫ్ బుకింగ్‌ను పరిశీలించి, పలు అంశాలను వివరించారు. ఏఈవోలు స్వరూప, అశోక్, రైతులు పాల్గొన్నారు.

పగిడ్యాల: మండలంలోని రైతులందరూ ఈ క్రాప్ పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి జ్యోతి కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ రైతులు ఆర్‌బికెల్లో ఈ క్రాప్ పంట నమోదు చేసుకోవాలన్నారు.

మిడుతూరు : రైతులు సాగు చేసిన పంటలను నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి పీర్ నాయక్ పేర్కొన్నారు. మండలంలోని తలముడిపి గ్రామంలో పంట నమోదును ఆయన పర్యవేక్షించారు. వ్యవసాయ అధికారి మాట్లాడుతూ పంట నమోదుతో సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు.

మిడుతూరు : రైతులతో మాట్లాడుతున్న అధికారులు

నంద్యాల రూరల్ : పంట నమోదు చేస్తున్న అధికారులు

బండి ఆత్మకూర్: పంట నమోదు చేస్తున్న అధికారులు

నులిపురుగుల నివారణకు 'ఆల్బెండజోల్'

(5వ పేజీ తరువాయి..) వైస్సార్ నగర్ యూపీహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ సుమిత్ర, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రీతం, ప్రోగ్రాం నిర్వాహకులు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. **రుద్రవరం :** మండలంలోని ఆలమూరు, నరసాపురం ,రుద్రవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో 5746 మంది విద్యార్థులకు గాను 5642 మందికి ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. వైద్యులు అమర్నాథ్ రెడ్డి, గాయత్రి, బాబు, శ్రావణి, సర్పంచులు పాణ్యం లక్ష్మీదేవి, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి : గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న చిన్నారులు విద్యార్థులు పరిశుభ్రత పాటిస్తే నులిపురుగులను దూరం చేయవచ్చని ఐసిడిఎస్ సూపర్వైజర్ నాగేశ్వరమ్మ, గ్రామ సర్పంచ్ జమీలాభి, రాజరాజేశ్వరి పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాసు దేవ రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రమైన కొత్తపల్లిలో ఉన్న శ్రీ రాజరాజేశ్వరి పాఠశాలలో, ముసలమడుగు గ్రామంలో ఉన్న అంగన్వాడి సెంటర్లలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ వేడుకలు జరిగాయి. అంగన్వాడి సెంటర్లో ఉన్న చిన్నారులకు పాఠశాలల్లో ఉన్న విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అంగన్వాడి సిబ్బంది నాగమణి, సునీత, వైద్య సిబ్బంది శ్రీరాములు నాయక్, సామమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బేతంచెర్ల : పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పిల్లలకు వేసి నులిపురుగులను నిర్మూలిద్దాం అని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ మల్లికార్జున రెడ్డి అన్నారు. మండల పరిధిలోని సిమెంట్ నగర్ ఆర్ఎస్ రంగాపురం గ్రామల నందు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి స్కూళ్లను,అంగన్వాడీ సెంటర్లలో నిర్వహిస్తున్న నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాలను తనిఖీ చేశారు. డాక్టర్ మౌనిక, ఆరోగ్య బోధకులు బేగ్, తదితరులు పాల్గొన్నారు. **పాములపాడు :** మండలములోని ప్రాథమిక,ఉన్నత పాఠశాలలు, అంగన్వాడి సెంటర్లు, కళాశాలలో పిల్లలందరికీ ఆల్బెండజోల్ మింగించారు. డాక్టర్లు గులాబ్షా, నాగలక్ష్మి దేవి, హెల్త్ ఎడిటర్ మల్లికార్జున హెల్త్ సూపర్వైజర్ గుర్రప్ప ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కొత్తపల్లి : అంగన్వాడి సెంటర్లో మాత్రలు ఇస్తున్న దృశ్యం

పాములపాడు : అంగన్వాడి సెంటర్లో మాత్రలు ఇస్తున్న దృశ్యం